J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 46 సంచిక : 18 2.10.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### నిప్పుకి చెద!

# వివాదాల వలయంలో సీఈసీ




- ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై తీవ్ర ఆరోపణలు
- జ్ఞానేష్‌కుమార్ రాజీనామాకు విపక్షాల పట్టు
- ఎన్నికల్లో అవకతవకలంటూ.. విచారణకు డిమాండ్

దేశంలో స్వయంప్రతిపత్తి కలిగిన అతికొద్ది విభాగాల్లో ఎన్నికల కమిషన్‌కి ప్రత్యేక స్థానముంది. ఒకవేళ అది కూడా అవినీతి, ఆశ్రిత పక్షపత్రం, అక్రమాలకు నిలయమైతే దేశంలో ప్రజాస్వామ్య పునాదులే కూలిపోయే పరిస్థితి నెలకొంటుంది. అంతటి మహత్తు కలిగిన ఎన్నికల కమిషన్‌లో నేడు కమీషన్ల కక్కుర్తి, క్విడ్‌ప్రోకో (నీకెంతా.. నాకెంత..) వంటి అమ్యామ్యాల పర్వం రాజ్యమేలుతోందని, ఓ పార్టీకి అనుకూలంగా ఏకంగా చీఫ్ ఎలక్షన్ కమిషనరే తప్పిదాలకు కేంద్రబిందువయ్యారనే ప్రచారం దేశాన్నే కుదిపేస్తోంది. నిజానికి నిప్పుకు చెదలుపట్టదు. సూర్యుడు పడమర ఉదయించ దన్నది ఎంత నిజమో.. మన దేశంలో ఎన్నికల వ్యవస్థ గాడితప్పదన్నది కూడా అంతే సత్యం. అయితే, అంబేద్కర్ ఓ సందర్భంలో చెప్పినట్లు రాజ్యాంగంలో చట్టాల పటిష్టత అన్నది వాటిని అమలుచేసే వ్యక్తులపై, ఆ యంత్రాంగం ఆధారపడి ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ క్రమంలోనే ప్రస్తుతం జాతీయ ఎన్నికల మిషన్‌లోనూ దొంగలు చొరపడ్డారా..? అత్యంత విశ్వసనీయ సంస్థలో పారదర్శకత అన్నది లేకుండా పోయిందా..? ఓ పార్టీతో అంటకాగుతూ రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారు స్వార్థం కోసం అమ్ముడుపోయారా..? అన్న ప్రశ్నలు సగటు భారతీయ పౌరుడి గుండెను పిండేస్తున్నాయి.

## ఒక్కతప్పుటడుగేసినా భావితరాలకు శాపమే!

మన దేశంలో ఒకప్పుడు రాచరికం రాజ్యమేలింది. అందులో రాజే సర్వాధికారి. రాజు చెప్పిందే వేదం. రాజు చెప్పిందే శాసనం. ఒక్కమాటలో చెప్పాలంటే దేశమంతా రాజుదే, రాజు దయాదక్షిణ్యాలపైనే ప్రజలు బతుకు ఈడ్చాల్సి వచ్చేది. కప్పం చెల్లించి మరీ రాజు పరిపాలనకు సలాం కొట్టాల్సి వచ్చేది. కానీ కాలం మారింది. రాచరికం స్థానంలో విదేశీ పాలన కొన్నేళ్లు ప్రజలను పట్టిపీడించింది. చివరికి స్వాతంత్ర్య సౌరభాలతో భారత ప్రజాస్వామ్యం ఘనంగా మొదలైంది. అప్పటి నుంచి కేంద్ర ఎన్నికల కమిషన్ నేతృత్వంలో నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహణ సాగుతోంది. గత 18 సార్వత్రిక ఎన్నికల్లో వందలాది పార్టీలను సమన్వయం, సహకారంతో స్వాతంత్ర్య భారతదేశంలో కేంద్రంలో లోక్‌సభకు, వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలను నిర్వహించారు. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఎందరో కమిషనర్లు అత్యంత సమర్థంగా నిర్వహించారు. ఎలాంటి రాగ ద్వేషాలు, పక్షపాతం లేకుండా ఎన్నికల ప్రక్రియను దశాబ్దాలుగా గట్టెక్కించారు. శేషన్ వంటి ఎన్నికల ప్రధాన అధికారులు ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ శాంతి సంస్థలతోనూ శభాష్ అనిపించుకున్నారు. అలాంటి ప్రతిష్టాత్మకమైన భారత ఎన్నికల కమిషన్ ఇప్పుడు వివాదాలకు, అక్రమాలకు కేంద్ర బిందువై స్వార్థానికి బలైపోతోందనే వాదనలు దేశ వ్యాప్తంగా జోరందుకుంటున్నాయి.

## 2024 తర్వాత జరిగిన ఎన్నికలన్నీ?

2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత హర్యానా, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అయితే అక్కడ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తారుమారు చేస్తూ బీజేపీ విజయ బావుటా ఎగురవేయడం విశ్లేషకులను సైతం ఆశ్చర్య పరిచింది. ఇక వివిధ రాష్ట్రాల ఉప ఎన్నికల్లోనూ కమలం పార్టీ జెండా ఎగురవేసింది. ఈ క్రమంలో హర్యానాలో ఈ సారి కాంగ్రెస్ సారధ్యంలో ప్రభుత్వం ఏర్పడుతుందని మెజారిటీ సర్వేలు చెప్పినా చివరికి బీజేపీనే విజయం వరించింది. ఇక మహారాష్ట్రలోనూ బీజేపీ నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించింది. బిహార్, పశ్చిమబెంగాల్‌లలో అంచనాలకు మించి దాదాపు మూడింట రెండు వంతుల మెజారిటీకి పైగా సాధించి బీజేపీ గెలుపొందడంతో ప్రత్యర్థి పార్టీలు ఎన్నికల పారదర్శకతపైనే అనుమానం వ్యక్తం చేశాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్

2లో

# పల్లెకి పండగొచ్చింది!



అది ఓ మారుమూల గ్రామం. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం, వరికుంటపాడు మండలంలో ఉన్న ఓ చిన్న పల్లె. ఆ పల్లె పేరు రామాపురం. ఆ పల్లెకి మొన్న సెప్టెంబర్ 29న పండగొచ్చింది. దసరా, దీపావళి, క్రిస్టమస్, భోగి, సంక్రాంతి కట్టగట్టుకుని ముందుగానే వచ్చాయా అన్నంత ఆనందంతో ఆ పల్లె సంబరపడిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేస్తున్న గ్రామీణాభివృద్ధి కార్యక్రమం "పల్లె పండుగ 3.0" సంరంభానికి రామాపురం గ్రామం వేదికయ్యింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేనాని ఆంధ్రా ప్రభుత్వ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో సహా కూటమి ప్రభుత్వంలోని అతిరథ మహారథ నాయకత్వం మొత్తం రామాపురానికి తరలివచ్చింది. రాష్ట్రస్థాయి నుండి గ్రామస్థాయి వరకు వివిధ ప్రభుత్వ శాఖల అధికార గణం అక్కడ హాజరయ్యింది. లక్షమందికిపైగా జన సమూహం ఆ పల్లె పండుగ వేడుకకి సాక్షీభూతమయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా 11,085 కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాల జాతరతో "పల్లెకి పండగొచ్చింది".

వివరాలు 7లో....



# 1.13 కోట్లతో శ్మశానవాటికలు

## • ప్రారంభించిన వేమిరెడ్డి దంపతులు



మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పక్కన ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట మండలం, కొత్తూరు పంచాయతీ పరిధిలో బిజీఆర్ కోల్ మైనింగ్ ఇన్ఫ్రా లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ. 1.13 కోట్లతో వివిధ వర్గాల వారి కోరికమేరకు, అభివృద్ధి చేసిన నాలుగు శ్మశాన వాటికలను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు ఇటీవలి ప్రారంభించారు. బీసీల శ్మశాన వాటికను రూ. 60 లక్షలతో, ఎస్సీల శ్మశాన వాటికను రూ. 25 లక్షలతో, సాధారణ ప్రజల శ్మశాన వాటికను రూ. 18 లక్షలతో, ఎస్టీల శ్మశాన వాటికను రూ. 10 లక్షలతో తీర్చిదిద్దారు. మనిషి బతికున్నంత కాలం గౌరవంగా జీవించడం ఎంత ముఖ్యమో, చనిపోయిన తర్వాత కూడా గౌరవప్రదంగా సాగనంపడం అంతే ముఖ్యమని వారు చెప్పారు. ప్రతి వర్గానికి సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ శ్మశాన వాటికలను సామాజిక బాధ్యతతో తీర్చిదిద్దిన దాతలు బిజీఆర్ సంస్థను, ఈ కార్యక్రమానికి ప్రోత్సహించిన గునపాటి రమేష్ రెడ్డి దంపతులను వేమిరెడ్డి దంపతులు అభినందించారు.

### ఎన్‌బీకేఆర్‌లో..

# ఏఐ వర్క్‌షాప్

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సెప్టెంబరు 30న 'ప్రాంప్ట్ టు ప్రొడక్షన్–పేటీఎం ఏఐ వర్క్ షాప్'ను నిర్వహించారు. ఐటీ, ఏఐ, డీఎస్ విభాగం, ఐఎస్‌టీఇల సహకారంతో చేపట్టిన ఈ వర్క్‌షాప్‌లో వందమంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు జెనరేటివ్ ఏఐ, ప్రాంప్ట్ ఇంజనీరింగ్, ఏఐ అసిస్టెడ్ డెవలప్‌మెంట్‌లతో పాటు ఏఐ ఆలోచనలను ఆచరణాత్మకంగా అప్లికేషన్లుగా రూపొందించే విధానంపై అవగాహన కల్పించారు. పేటీఎం సంస్థకి చెందిన ప్రోగ్రామ్ లీడ్ సుమన్ మండల, మైక్రోసాఫ్ట్‌కి చెందిన ఎస్‌డీఇ–2 శివమ్ బెహాల్ రిసోర్స్ పర్సన్‌లుగా పాల్గొని, ఏఐ ఆధారిత అభివృద్ధికి సంబంధించిన అంశాలను విద్యార్థులకు వివరించారు. ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ప్రిన్సిపాల్ డా. శ్రీనివాసులు కార్యక్రమ సమన్వయకర్త ఎం. శివప్రతాప్ రెడ్డి, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు. ప్రతిభను కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# రూరల్ అభివృద్ధే మా లక్ష్యం!

## కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



సీ.సీ.రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

'మా జెండా–అజెండా ఒక్కటే..నెల్లూరు రూరల్ అభివృద్ధే మా లక్ష్యం' అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సోదరుడు, టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని పాత వెల్లంటి గ్రామంలో ఆయన ఇటీవల 56 లక్షల రూపాయల వ్యయంతో సీ.సీ. రోడ్డు మరియు కొండ్లపూడి గ్రామంలో 39 లక్షల రూపాయల వ్యయంతో సీ.సీ. రోడ్డు పనులకు జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన, నెల్లూరు ఏఎంసీ ఛైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, గామాలలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్‌లో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి జరుగుతోందన్నారు. శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఛైర్మెన్ ఇందుపూరు అచ్యుత్‌రెడ్డి, మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వివాదాల వలయంలో సీఈసీ

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, లాలూ ప్రసాద్ యాదవ్, మమతాబెనర్జి వంటి వారు ఎన్నికల కమిషన్ బీజేపీకి అమ్ముడుపోయిందని, ఫలితంగానే ఇలాంటి ఫలితాలు పునరావృతమవుతున్నాయని ఆరోపించారు. కానీ, ఈ ఆరోపణలకు నిర్దిష్టమైన ఆధారాలు లేకపోవడంతో అవి కేవలం విమర్శలుగానే మిగిలిపోయాయి.

## వేళ్ళన్నీ జ్ఞానేష్‌కుమార్ వైపే!

ఇక 2025లో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమితులైన సీనియర్ ఐఏఎస్ జ్ఞానేష్‌కుమార్ 1988లో సివిల్ సర్వీస్‌కు కేరళ కేడర్‌లో ఎంపికయ్యారు. అంచెలంచెలుగా ఎదుగుతూ భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ స్థాయికి చేరుకున్నారు. అయితే ఈయన నేతృత్వంలో వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తీవ్ర వివాదాస్పదమైంది. ఈ ప్రక్రియను ప్రారంభించినప్పటి నుంచి దాదాపు 13 కోట్లకుపైగా భారతీయ ఓటర్లను అన్యాయంగా తొలగించారనే ఆరోపణలు వెల్లు వెత్తాయి. చివరికి తన జాతీయను నిరూపించుకునే క్రమంలో ఎందరో భారతీయులు పడరాని పాట్లు పడడం, జాతీయతను నిర్ధారించే ధ్రువీకరణ పత్రాలను సమర్పించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం విమర్శలకు దారితీసింది. దీంతో ఎన్నికల కమీషన్‌లో మిగిలిన ఇద్దరు కమిషనర్లు కొత్త ఓటర్లను నమోదు చేసే ఫారం–6లో అత్యంత క్లిష్టమైన నిబంధనలు విధించడం తగదంటూ ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్‌కుమార్‌తో విభేదించారు. దీంతో దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియ, సర్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే ఇటీవల అత్యవసర సమావేశం నిర్వహించిన ప్రధాన ఎన్నికల అధికారి ఫారం–6లో ప్రకటించిన ప్రత్యేక నిబంధన సదరు దరఖాస్తుదారుడు స్థానిక అధికారి వద్ద స్వయంగా హాజరు కావాల్సిన అవసరం లేదంటూ సవరింపు నిబంధన తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. అయితే, అప్పటికే దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియలో లోపాలున్నాయంటూ స్వచ్ఛంద సంస్థలు, వివిధ విభాగాల అధికారులు, రాజకీయ నాయకులు ఆరోపించడంతో ఈ వ్యవహారం చినికిచినికి గాలివానగా మారింది.

## జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనా?

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ బీజేపీకి ముఖ్యంగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాలకి ఇంటి మనిషిగా మారి దేశంలో ఎన్నికలని ప్రహసనంగా మార్చేశారని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ధ్వజమెత్తింది. ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే స్వలాభం, స్వార్థం కోసం అమ్ముడుపోయిన జ్ఞానేష్‌కుమార్‌ను పదవి నుంచి బర్తరఫ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై దేశద్రోహం వంటి అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని నినదించారు. ఇక ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీపార్టీ, బెంగాల్‌లో తృణముల్ కాంగ్రెస్, బిహార్‌లో ఆర్జేడీ, తమిళనాడులో స్టాలిన్ డీఎంకే, విజయ్ టీవీకే వంటి పార్టీలు, ఇతర వామపక్ష పార్టీలు జ్ఞానేష్‌కుమార్ టార్గెట్‌గా తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. జ్ఞానేష్‌కుమార్ ఇద్దరు కుమార్తెలు సివిల్ సర్వీస్ ఉద్యోగులుగా, వారి అల్లుళ్లు ఐఏఎస్‌లుగా ఉన్నారని, ఇదంతా జ్ఞానేష్‌కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న కారణంగా చేకూరిన లబ్ధి అంటూ ఆరోపిస్తున్నారు. సర్ ప్రక్రియను పూర్తిగా బీజేపీకి లాభం చేకూర్చేలా మార్చి ఎన్నికల వ్యవస్థను జ్ఞానేష్‌కుమార్ చెరపట్టారంటూ విమర్శలకు దిగుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సైతం సర్ వల్ల స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యాయని, ముఖ్యంగా ఆంధ్రాలో మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు సర్ ప్రక్రియలో తీసుకొస్తున్న మార్పులు, నిబంధనలు అడ్డకిగా మారాయని పలువురు విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే అటు చంద్రబాబు, ఇటు జగన్ ఈ విషయంపై ధైర్యంగా స్పందించే సాహసం చేయడం లేదు.

## సచ్చీలతని నిరూపించుకోవాల్సిందే!

దేశంలో ప్రజాస్వామ్య పునాదులు ఎన్నికల ప్రక్రియపైనే ఆధారపడి ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషనర్‌పై వస్తున్న ఆరోపణలకు వారు తప్పనిసరిగా జవాబివ్వాల్సిన అవసరం కనిపిస్తోంది. ముఖ్యంగా జ్ఞానేష్‌కుమార్ తన నిజాయితీని నిరూపించుకునే క్రమంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, వామపక్ష నాయకులు అడుగుతున్న ప్రశ్నలకు సవివరమైన సమాధానం ఇచ్చినప్పుడే ఎన్నికల ప్రక్రియ లోపభుయిష్టంగా లేదని ప్రజలు నమ్మే పరిస్థితి ఉంటుంది. లేకుంటే కార్పొరేట్ సంస్థ తరహాలో భారతీయ ప్రజాస్వామ్యం కూడా కొందరి చేతుల్లో బందీ అయ్యి తమకు నచ్చిన వారిని ఎంపిక చేసుకుని ప్రజా ప్రతినిధులుగా పెత్తనం చెలాయించే అవకాశం కల్పించే స్థితికి దిగజారిపోవచ్చు. తద్వారా చట్టసభల్లో మెజారిటీ పేరుతో తమకు నచ్చిన చట్టాలను తెచ్చి పాలకులు తైతక్కలాడే దుస్థితి రావొచ్చు. ముఖ్యంగా ఈ పరిణామాలన్నీ చివరికి నియంతృత్వ పోకడలకూ దారితీయవచ్చు. అందుకే తడబడుతున్న భారతప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల ప్రక్రియను తిరిగి పటిష్టంగా నిలబెట్టుకోవాల్సిన బాధ్యత భారత పౌరులపైనే ఉంది. ఒకవేళ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్న మాట వాస్తవం అయితే ఏకంగా భారత ఎన్నికల కమిషనరే దారితప్పితే ఎన్నికల సంఘంపై ప్రజలంతా విశ్వాసం కోల్పోవడం తథ్యం. ఆ తర్వాత జరిగే విపరిణామాలకి భావిభారతం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఒక్కమాట మాత్రం నిజం, ఈవీఎం మాయాజాలంలో ఉన్న మతలబేందో, దాని వెనుక ఉన్న లోగుట్టేందో, దేశాన్ని ఏలుతున్న పెద్దలకి ఎన్నికల ప్రక్రియను నడిపిస్తున్న యంత్రాంగానికే తెలుసంటే అతిశయోక్తి కాదేమో. నిజానిజాలు ఆ దైవానికి తెలియాలి. జై శ్రీరామ్!

### అంగన్‌వాడీ కేంద్రాలకి..

# కాకర్ల సతీమణి వితరణ



సీలింగ్ ఫ్యాన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సతీమణి కాకర్ల ప్రవీణ

కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సెప్టెంబరు 30న వింజమూరులోని గంగమిట్ట, బీసీ కాలనీ, అరుంధతివాడ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ సతీమణి కాకర్ల ప్రవీణ, మాజీ ఎంపీపీ వనిపెంట హైమావతి, ఉదయగిరి నియోజకవర్గ మహిళ ప్రధాన కార్యదర్శి రేబాల రూపకలతో కలిసి 5 సీలింగ్ ఫ్యాన్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేలా అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వారు తెలిపారు. చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని, అవసరమైన వసతుల కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

### సీనియర్ న్యాయవాది పెల్లేటి గోపాల్‌రెడ్డికి..

# గౌరవ జాతీయ పురస్కారం



అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సేవలందిస్తున్న న్యాయవాదులకు సత్కారాలు జరిగాయి. కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవిర్భావం నుంచి న్యాయవాదిగా, కోట బార్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడుగా, బిజెపి నేతగా కక్షిదారులకు న్యాయాన్ని అందించే న్యాయవాదిగా పేరుగాంచిన సీనియర్ న్యాయవాది పెల్లేటి గోపాల్ రెడ్డికి గౌరవ జాతీయ పురస్కారం బహుకరించి సన్మానించారు. ఎంవి రావు ఫౌండేషన్ ఛైర్మెన్ ముప్పవరపు లీలా మోహన్‌కృష్ణ వారికి శాలువా మెమెంటో షీల్డ్ అందజేసి సత్కరించారు. సీనియర్ న్యాయవాది పెల్లేటి గోపాల్‌రెడ్డి సేవలు జూనియర్ న్యాయవాదులకు ఎంతో స్ఫూర్తిదాయకమని లీలామోహన్ కృష్ణ ఈ సందర్భంగా కొనియాడారు.

# చాణక్య సర్వేలో శ్రీధర్‌రెడ్డికి గుర్తింపు

# రాష్ట్రంలో 2వ స్థానం

## ఓటు షేర్‌లో టీడీపీకి ఆధిక్యం..

## ఎమ్మెల్యేల పనితీరులో.. నెల్లూరు రూరల్‌కు రెండో స్థానం



***ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుత ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేలా చాణక్య స్ట్రాటజీస్ నిర్వహించిన తాజా సర్వేలో అనేక ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూశాయి. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు నెలల పాటు నిర్వహించిన ఈ సర్వేలో సుమారు 52,500 మంది అభిప్రాయాలను సేకరించినట్లు ఆ సంస్థ వెల్లడించింది. సర్వే అంచనాల ప్రకారం ప్రస్తుతం ఎన్నికలు జరిగితే టీడీపీకి 46.9 శాతం, వైఎస్సార్ సీపీకి 35 శాతం, జనసేనకు 9 శాతం, బీజేపీకి 3.5 శాతం, ఇతర పార్టీలకు 5.6 శాతం ఓటు షేర్ లభించే అవకాశం ఉందని చాణక్య స్ట్రాటజీస్ పేర్కొంది.***

ఈ సర్వేలో ఎమ్మెల్యేల పనితీరుపై వెల్లడించిన వివరాలు ప్రత్యేకంగా చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రస్థాయి ఎమ్మెల్యేల జాబితాలో మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ తర్వాత నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రెండో స్థానంలో ఉన్నట్లు సర్వే వివరాలు పేర్కొన్నాయి. ఆ తర్వాత పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు 3, 4 స్థానాలు పొందారు. ఒక్క కోటంరెడ్డి మినహా, మిగతా ముగ్గురూ మంత్రులు కావడం ఇక్కడ గమనించదగ్గ అంశం!

నెల్లూరుజిల్లాకు సంబంధించి చూస్తే జిల్లాలో అత్యున్నత స్థానంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఉన్నట్లు సర్వే పేర్కొంది. ప్రజలతో ఎమ్మెల్యేకు ఉన్న అనుసంధానం, నియోజకవర్గ స్థాయిలో పనితీరుపై ప్రజాభిప్రాయం వంటి అంశాల ఆధారంగా ఈ ర్యాంకింగ్ రూపొందించినట్లు చాణక్య నివేదికలు వెల్లడించాయి.

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే నెల్లూరురూరల్ నియోజకవర్గంలో ఆయనకు వరుస విజయాల చరిత్ర ఉంది. 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున, 2024 ఎన్నికల్లో టీడీపీ తరఫున విజయం సాధించారు. 2024లో ఆయన 1,09,975 ఓట్లు సాధించి 34,480 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఇక నియోజకవర్గ అభివృద్ధి అంశాల్లోనూ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పలు కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న విషయం తెలిసిందే. 'గడప గడపకు ఎమ్మెల్యే' అంటూ ఇంటింటికీ తిరిగినా.. 'భావి భవిష్యత్తు జన్‌జీలదే' అంటూ రేపటి తరాన్ని నేరుగా కలుసుకునే సరికొత్త కార్యక్రమాన్ని చేపట్టినా.. అవన్నీ శ్రీధర్‌రెడ్డి సొంత ఆలోచనలే. శంకుస్థాపన చేసిన రోజే.. ప్రారంభోత్సవ తేదీలను ప్రకటించడం కూడా ఒక్క శ్రీధర్‌రెడ్డికే చెల్లింది.

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రెండో స్థానంలో నిలవడం నెల్లూరు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజాభిప్రాయంతో వచ్చిన ఈ గుర్తింపు ఆయనకు మాత్రమే కాకుండా నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి కూడా ఒక ప్రత్యేకతని తీసుకొచ్చిందని చెప్పొచ్చు.

రాష్ట్ర స్థాయిలో పని తీరులో తమ నాయకుడికి రెండవ స్థానం రావడం పట్ల కోటంరెడ్డి శిబిరంలో ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి కావడానికి కావలసిన అన్ని అర్హతలు తమ నాయకుడు సాధించాడని, విస్తరణ ఎప్పుడు జరిగినా శ్రీధర్‌రెడ్డికి బెర్తు ఖాయం అన్న ధీమాని కోటంరెడ్డి అభిమానులు వ్యక్తం చేయడం ఇక్కడ గమనార్హం.



## వైభవంగా..వెంకటగిరి పోలేరమ్మ జాతర!

- **అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం**

రాష్ట్ర పండుగగా అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న వెంకటగిరి పోలేరమ్మ అమ్మవారి జాతర ఈసారి మరింత వేడుకగా జరుగుతోంది. జాతర సందర్భంగా వెంకటగిరి పట్టణం జనసంద్రంగా మారింది. బుధ, గురువారాల్లో జనజాతరా అన్నట్లుగా వెంకటగిరిలో ఎక్కడ చూసినా భక్తజనమే కనిపించారు. అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా ఈనెల 1న గురువారం నాడు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి ఆశీస్సులందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి స్థానిక శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, దేవాదాయశాఖ అధికారులు స్వాగతం పలికారు.


నెల్లూరు నగర పరిధిలో

**స్కూలు కొనుగోలు / లీజుకి కావలెను**

**హైదరాబాదుకి చెందిన ఒక కార్పొరేట్ సంస్థకి నెల్లూరు నగర పరిధిలో కొనుగోలు చేయుటకు లేదా లీజుకి రన్నింగ్‌లో వున్న స్కూలు కావలెను.**

ఆసక్తికలవారు క్రింది నంబర్లని సంప్రదించగలరు.

**93472 22361, 95131 90990**


### నా రాజకీయ ప్రస్థానానికి

## తొలి మెట్టు వేసింది.. వివేకన్నే!

- అన్న విగ్రహావిష్కరణలో తమ్ముడు ఆనం





"ఓటమి ఎరుగని ప్రజానేత... నెల్లూరు రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన నాయకుడు... ప్రజల ప్రేమాభిమానాలనే తన విజయాలకు పునాదిగా మలుచుకున్న వ్యక్తి స్వర్గీయ ఆనం వివేకానంద రెడ్డి" అని, తన రాజకీయ ప్రస్థానానికి తొలి మెట్టు వేసింది కూడా వివేకన్నేనని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల నెల్లూరులోని 14వ డివిజన్ వేపదొరువులో 40 లక్షల రూపాయల నుడా నిధులతో ఆనం వివేకానందరెడ్డి పార్కు ఏర్పాటుచేశారు. ఈ ప్రారంభోత్సవంలో మంత్రి నారాయణ, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో పాటు మంత్రి ఆనం పాల్గొని మాట్లాడారు.

స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి రాజకీయ ప్రస్థానం పదవుల కోసం సాగిన ప్రయాణం కాదని, ప్రజల మధ్య నుంచి ఎదిగి ప్రజల విశ్వాసాన్ని పదేపదే గెలుచుకున్న విజయ ప్రస్థానమని ఆనం తెలిపారు. మున్సిపల్ రాజకీయాల నుంచి శాసనసభ వరకు ఆయన అడుగుపెట్టిన ప్రతి రాజకీయ వేదికపై ప్రజల ఆదరణే ఆయనకు అండగా నిలిచిందన్నారు. నెల్లూరు నగర రాజకీయాల్లో వివేకానందరెడ్డి ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించారని, స్థానిక సంస్థల రాజకీయాల్లో తనదైన నాయకత్వాన్ని చాటుకోవడంతో పాటు, నెల్లూరు నగర శాసనసభ్యుడిగా ప్రజల విశ్వాసాన్ని పొందుతూ వరుస ఎన్నికల్లో విజయాలు సాధించి "ఓటమి ఎరుగని నాయకుడు"గా గుర్తింపు పొందారని మంత్రి గుర్తుచేశారు. "వివేకా విజయాల వెనుక డబ్బు, అధికారం కాదు... ప్రజలతో ఏర్పరచుకున్న ఆత్మీయ అనుబంధమే అసలైన శక్తి" అని మంత్రి ఆనం వివరించారు. "వివేకా సాధించిన గొప్ప విజయం ఎమ్మెల్యేగా గెలవడం మాత్రమే కాదు. నెల్లూరు ప్రజల హృదయాలను గెలుచుకోవడం. అదే ఆయన జీవితంలో సాధించిన అతిపెద్ద విజయం' అన్నారు.




లాయర్
అక్టోబరు 02, 2026

# మాటలకే పరిమితమవుతున్న..జంతు సంక్షేమం!

అక్టోబరు 4..ప్రపంచ జంతు దినోత్సవం. మనుషులకే కాదు, జంతువులకి కూడా ఒక దినోత్సవం ఉంటుందని గుర్తు చేసే రోజు అది. జంతు ప్రేమికులకు, జంతు సంరక్షణ సంస్థలకి ఒక ఉత్సాహవంతమైన రోజు కూడా. జంతువులను సంరక్షించుకునేవారందరూ ఒకచోట చేరి..జంతువుల పెంపకం పట్ల ఇంకా ఏంచేయాలో చర్చించుకుంటారు. అలా..మనలో ఒకటిగా కలిసివున్న జంతువుల పట్ల మరింత ప్రేమను చాటు కుంటారు. జంతువులను కాపాడుకుంటూ, వాటి పట్ల దయ, కరుణ, ప్రేమను చూపాలనే సదుద్దేశంతో ఏటా ఈ దినోత్స వాన్ని జరుపుకోవడం ఆనవాయితీ. కానీ, నానాటికీ ప్రపంచంలో జంతు సంరక్షణ అనేది మాటలకే పరిమితమవుతోండడం విచారకరం. జంతువులను సంరక్షించాలంటూ ప్రతి దేశంలో కఠినమైన చట్టాలెన్ని ఉన్నా, ఆచరణలో అవి సరిగా అమలులోకి రావడం లేదు. ముఖ్యంగా అడవులను నరికేయడం, పట్టణీకరణ-నగరీకరణ వంటి వాటివల్ల జంతువులకు ఆవాసం కరువవుతోంది. కానీ, అడవుల విధ్వంసాన్ని ఎవరూ ఆపలేకపోతున్నారు. దీంతో అనేకరకాల జీవజాతులు, జంతుజాతులు, వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోతోంది. మనిషి స్వార్థంతో అడవులను, అడవి జంతువులను కూడా నాశనం చేస్తుండడంతో చివరికి మానవ మనుగడకు ప్రాణప్రదమైన జీవ వైవిధ్యమే దెబ్బతింటోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఈ భూమండలం మీద మనిషొక్కడే కాదు..కోటానుకోట్ల జంతువులు, పక్షులు, సముద్రపు జీవులు, ఎన్నో రకాల జీవరాశులు కూడా ఉన్నాయి. భూమి పుట్టుక నుంచి అనేకరకాల జంతు జాతులు, క్రిమికీటకాదులు నేలతల్లి బిడ్డలుగా జీవిస్తూనే ఉన్నాయి. అయితే, కాలక్రమంలో మనిషే వాటన్నిటిపై ఆధిపత్యం సంపాదించి, వాటిని అనునిత్యం వేటాడుతూ అత్యంత కఠినంగా, నిర్దాక్షిణ్యంగా జంతువుల ప్రాణాలు తీస్తున్నాడు. ప్రపంచవ్యాప్తంగా జంతు హింస పెరిగిపోతుండడంతో ఈ భూమ్మీద ఉన్న కోటానుకోట్ల జంతువులు, జంతు జాతులు సైతం క్రమేణా కనుమరుగైపోతున్నాయి. అసలు, మనిషి కన్నా ఈ భూమి మీద మొదటిస్థానం జంతువులదేనని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. కానీ, ఇప్పుడు వాటి స్థానం అట్టడుగుకి వెళ్లిపోయింది. అటవీప్రాంతాల్లో జంతువులను అక్రమంగా వేటాడి, వాటిని చంపి విక్రయించి సొమ్ము చేసుకోవడం అనేకమందికి నిత్యకృత్యమైపోయింది. ప్రపంచవ్యాప్తంగా అన్నిచోట్లా ఈ దారుణం జరిగిపోతూనే ఉంది. తమ అవసరాల కోసం అడవులకి నిప్పు పెట్టి తగులబెట్టడం వంటి అకృత్యాలతో జంతువులకు నిలువ నీడ లేకుండా పోతోంది. వాటికి తిండి తిప్పలు లేక, తాగేందుకు నీళ్లు కూడా కరువై చివరికి ఊళ్ల మీదికి రావడం తరచూ జరుగుతూ ఉంది. జంతువులను వేటాడం, రవాణా చేయడం, జంతువులను హింసించేవారిని దండించడం నేరమని చట్టాల్లో ఉన్నా, ఏళ్ళ తరబడిగా అవి అటకెక్కిపోతున్నాయి. పాలివ్వని గేదెలను, గోవులను కూడా వాహనాల్లో కుక్కి అమానవీయంగా రవాణా చేసి వాటిని వధశాలలకి తరలిస్తూనే ఉన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు మరింత కఠినమైన చట్టాలతో జంతువులను సంరక్షించాలి. జంతువులను చంపి అక్రమ వ్యాపారాలు చేసేవారిని కఠినంగా శిక్షించాలి. నేటి ఆధునిక సమాజంలోనూ ఇప్పటికీ ఎన్నో రకాల పెంపుడు జంతువులు మానవ జీవితాల్లో కలగలసిపోతున్నాయి. వాటినైనా ప్రేమగా సంరక్షించుకోవాలి. జంతువులను పరిరక్షించుకునేందుకు ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయించి, సర్వత్రా శిబిరాలు ఏర్పాటుచేసి వాటిని కాపాడాలి. ముఖ్యంగా వీధి జంతువుల పరిరక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. వాటిని కొట్టడం, హింసించి చంపడం తగదు. జంతువులకి కూడా జీవించే హక్కు ఉందని, వాటి హక్కులను పరిరక్షించాల్సింది మనమేనని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలి. తద్వారా ఈ భూమిపై జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా మనదే. చిన్నతనం నుంచే పిల్లలకు మూగజీవాల పట్ల ప్రేమగా ఉండడం నేర్పాలి. పాఠశాల, కళాశాల స్థాయిల్లోనూ జీవవైవిధ్యం ప్రాధాన్యత, జంతుసంరక్షణల గురించి వివరించాలి. ప్రభుత్వాలు జంతువుల పరిరక్షణకు సంబంధించి శాశ్వత ప్రాతిపదికపై ప్రచారాన్ని, అవగాహన సదస్సులను కొనసాగిస్తూనే ఉండాలి. మన ఇంటిమీద వాలే పక్షుల దాహార్తి తీర్చేందుకు గోడలమీద ఓ చిన్న గిన్నెలో కాసిన్ని నీళ్ళు పెట్టడం, వీధి జంతువులకు ఆహారం వేయడం, మూగజీవాల పట్ల ఎవరూ క్రూరంగా వ్యవహరించకుండా చూడడం వంటివి పిల్లలకు నేర్పాలి. పెద్దలు ఆచరించి చూపాలి.

ఏదేమైనా, జంతువుల పట్ల మనకున్న ఆలోచనల్లో మార్పు వచ్చినప్పుడే, వాటి పట్ల ప్రేమ ఏర్పడుతుంది. మానవతా దృక్పథంతో వాటిని పరిరక్షించుకున్నప్పుడే మానవ జీవితం కూడా సాఫీగా సాగుతుంది. అప్పుడే జంతు హింసకి బదులు, జంతు సంరక్షణకు సరైన దారి ఏర్పడుతుంది.

# ముట్టుకుంటే షాక్ కొడుతున్న.. కరెంటు బిల్లులు!

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ బిల్లులు సామాన్య వినియోగదారులకు భారంగా మారుతున్నాయి. ఓవైపు కరెంటు వినియోగానికి సంబంధించిన చార్జీలు పెరుగుతుండగా, మరోవైపు వివిధ రకాల అదనపు చార్జీల పేరుతో బిల్లుల మొత్తం మరింత పెరుగుతోంది. నెలాఖరులో చేతికి వచ్చే విద్యుత్ బిల్లును చూసి సామాన్య కుటుంబాలు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. విద్యుత్ వినియోగం పెరిగితే బిల్లు పెరగడం సహజమే. అయితే, అసలు వినియోగ చార్జీలకు అదనంగా ఫిక్స్‌డ్ చార్జీలు, ఇతర సర్దుబాటు చార్జీలు, పన్నులు, సర్‌చార్జీల వంటి అంశాలు బిల్లులో చేరుతుండటంతో వినియోగదారులపై ఆర్థిక భారం పెరుగుతోంది. బిల్లులో ఏ చార్జీ ఎందుకు విధించారో సామాన్యులకు సులభంగా అర్థమయ్యేలా వివరాలు కూడా ఉండాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులతో ఇప్పటికే సామాన్య కుటుంబాల బడ్జెట్లు తలకిందులవుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ బిల్లుల పెరుగుదల అదనపు భారంగా మారుతోంది. ముఖ్యంగా తక్కువ, మధ్యతరగతి కుటుంబాలు నెలవారీ విద్యుత్ బిల్లును చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నాయి. ప్రభుత్వం, విద్యుత్ నియంత్రణ సంస్థలు ఈ పరిస్థితిని పరిశీలించి అదనపు చార్జీలపై స్పష్టత ఇవ్వాలి. వినియోగదారులపై అనవసరమైన భారం పడకుండా చర్యలు తీసుకోవాలి. విద్యుత్ బిల్లులో ప్రతి చార్జీకి సంబంధించిన వివరాలను పారదర్శకంగా చూపించడంతో పాటు, సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా విద్యుత్ ధరల వ్యవస్థను రూపొందించాలి. కరెంటు అనేది విలాస వస్తువు కాదు... ప్రతి కుటుంబానికి నిత్యావసర సేవ. దాని బిల్లు సామాన్యుడికి షాక్ ఇచ్చేలా కాకుండా, భరించగలిగేలా ఉండేలా చూడడం ప్రభుత్వాల బాధ్యత.

జీ.వీ.సుబ్బయ్య, పిడుగురాళ్ళ.

# క్షణాల్లో మాయమవుతున్న రూ.300 దర్శన టిక్కెట్ల కోటా!

తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్‌లో విడుదలచేస్తున్న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కేవలం 20 నిమిషాల్లోనే మాయమైపోతున్నాయి. సుమారు నాలుగున్నర లక్షల టిక్కెట్లు ఇంత తక్కువ సమయంలోనే బుక్ అయిపోవడం సాధారణ భక్తుల్లో అనేక సందేహాలకు తావిస్తోంది. టిక్కెట్లు విడుదలైన వెంటనే సర్వర్‌పై విపరీతమైన ఒత్తిడి ఏర్పడటం, కొద్ది నిమిషాల్లోనే కోటా పూర్తవడంతో ఎంతోమంది భక్తులు టిక్కెట్లు పొందలేక నిరాశకు గురవుతున్నారు. అసలు అన్ని టిక్కెట్లు ఏ రకంగా, ఏ సమయంలో, ఏ విధానంలో బుక్ అవుతున్నాయన్న దానిపై టీటీడీ మరింత పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉంది. భక్తుల విశ్వాసాన్ని కాపాడేందుకు టిక్కెట్ల బుకింగ్ ప్రక్రియపై సమగ్ర వివరాలను టీటీడీ వెల్లడించాలి. ఆన్‌లైన్ బుకింగ్‌లో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేదని సాంకేతికంగా నిరూపించి భక్తుల అనుమానాలను నివృత్తి చేయాలి. శ్రీవారి దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులకు పారదర్శకమైన బుకింగ్ వ్యవస్థే టీటీడీపై విశ్వాసాన్ని మరింత పెంచుతుంది.

- లక్ష్మీభరద్వాజ్, హైదరాబాద్.

# ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొందాం

మనసులో మాట 117

ప్రపంచంలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఆర్థిక సంక్షోభాలు, యుద్ధాల ప్రభావం ఏ ఒక్క దేశానికీ పరిమితం కాదని నేటి ప్రపంచ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. యుద్ధాలు, సంక్షోభాల కారణంగా ఎరువుల కొరత, ధాన్యం సరఫరాలో అంతరాయాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల రాబోయే రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఒక "పెద్ద ఆహార సంక్షోభం" మునుపెన్నడూ లేని విధంగా ముంచుకొచ్చే ప్రమాదం ఉందని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఇటీవల స్పష్టం చేశారు.

ఇటీవల కాలంలో అంతర్జాతీయంగా జరుగుతున్న యుద్ధాలు (ముఖ్యంగా పశ్చిమాసియా/మధ్యప్రాచ్య సంక్షోభాలు, ఉక్రెయిన్-రష్యా ఉద్రిక్తతలు) సరఫరా గొలుసును దెబ్బతీయడం వల్ల ముడి చమురు, ఎరువులు మరియు ఆహార ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగాయి. భారతదేశంలో రిటైల్ ఆహార ద్రవ్యోల్బణం 5.95 శాతానికి (ఆగస్టు గణాంకాల ప్రకారం) పెరిగింది. ఇది గ్రామీణప్రాంతాల్లో మరింత ఎక్కువగా (6 శాతానికి పైగా) నమోదవుతూ సామాన్యప్రజల మీద తీవ్ర భారాన్ని మోపుతోంది.. టోకు మార్కెట్లో ధరలు దాదాపు 9.92 శాతానికి ఎగబాకాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడం, రవాణాఖర్చులు భారం కావడం ఇందుకు ప్రధాన కారణం. యుద్ధాలు మరియు భౌగోళిక రాజకీయ అస్థిరతలు అంతర్జాతీయ మార్కెట్‌ను ఎలా శాసిస్తున్నాయో, మన దేశంపై వాటి ప్రభావం ఏ స్థాయిలో ఉందో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇలాంటి అనిశ్చిత పరిస్థితులలో మన దేశం వంటి అత్యధిక జనాభా కలిగిన దేశం కేవలం విదేశీ దిగుమతులపై లేదా బయటి మార్కెట్లపై ఆధారపడటం క్షణక్షణం ప్రమాదకరమే.మన దేశంలోనే ఆహార ధాన్యాలు, కూరగాయల ఉత్పత్తిని పెంచుకోవడం ఎంతైనా అవసరం. కాబట్టి ప్రతి పౌరుడూ ఒక బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తేనే భవిష్యత్తులో ఏర్పడే సంక్షోభాలను ఎదుర్కొని, సంపూర్ణ స్వయం సమృద్ధిని సాధించగలం. భారత్ వంటి అత్యధిక జనాభా కలిగిన దేశం తన ఆహార భద్రత కోసం కేవలం వ్యవసాయ భూముల మీదే కాకుండా, ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది.

భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశమైనప్పటికీ, పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ కారణంగా సాగు భూములు క్రమంగా తగ్గిపోతున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం, మన దేశంలో మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో సుమారు 46% నుంచి 50% వరకు మాత్రమే నికర సాగు భూమి అందుబాటులో ఉంది. మరోవైపు, పట్టణ ప్రాంతాలలో కాంక్రీట్ భవనాలు, అపార్ట్‌మెంట్ల పైకప్పుల రూపంలో వందలాది చదరపు కిలోమీటర్ల పైకప్పుల స్థలం పూర్తిగా నిరుపయోగంగా, వృథాగా ఉండిపోతోంది. ఒక అంచనా ప్రకారం, కేవలం పట్టణ ప్రాంతాల్లోనే ఇళ్లు మరియు వాణిజ్య భవనాల పైకప్పుల విస్తీర్ణం లక్షలాది హెక్టార్లకుపైగా ఉంటుంది. ఈ నిరుపయోగంగా ఉన్న పైకప్పుల స్థలాన్ని హరిత క్షేత్రాలుగా మలచుకోగలిగితే, అది దేశ ఆహార భద్రతకు అద్భుతమైన ప్రత్యామ్నాయంగా మారుతుంది.

ప్రపంచ మార్కెట్లో ముడి చమురు, వంటనూనెలు, ఇతర నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా మనం వంటనూనెల కోసం పెద్ద ఎత్తున దిగుమతులపై ఆధారపడుతున్నాం. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై ఆధారపడటం వల్ల ఆర్థిక వ్యవస్థపై అదనపు భారం పడుతుంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకాలంటే, విధానపరమైన మార్పులతో పాటు ప్రతి పౌరుడి ఆలోచనా విధానంలోనూ మార్పు రావాలి. ప్రస్తుత పట్టణ వాతావరణంలో కాంక్రీట్ అడవులు విస్తరిస్తున్న తరుణంలో ప్రతి ఇంటి మేడ లేదా బాల్కనీని ఆకుపచ్చని తోటగా మలచుకోవడం అత్యంత ముఖ్యం. 'మిద్దె తోటలు' కేవలం ఒక అభిరుచిగా కాకుండా, నిత్య జీవితంలో భాగం కావాలి. ప్రతి పౌరుడు తన ఇంటి అవసరాలకు సరిపడా కూరగాయలు, కొన్ని రకాల కాలానుగుణ పండ్లను ఇళ్లలోనే పండించుకునే దిశగా అడుగులు వేయాలి.

ఇది కేవలం వ్యక్తిగత చొరవతో మాత్రమే ఆగిపోకూడదు; ఇదొక జాతీయ విధానంగా రూపుదిద్దుకోవాలి. ప్రభుత్వాలు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల ద్వారా పట్టణ ప్రాంతాల్లో మిద్దె తోటల పెంపకానికి సబ్సిడీలు, ఉచిత శిక్షణ శిబిరాలు మరియు ప్రోత్సాహకాలను అందించాలి. నూతన భవన నిర్మాణ అనుమతుల్లోనే పైకప్పులపై మొక్కలు పెంచేందుకు తగిన సాంకేతిక ఏర్పాట్లు ఉండేలా నిబంధనలు రూపొందించాలి. ఈ విధానం వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది టన్నుల కూరగాయలు స్థానికంగానే ఉత్పత్తి అవుతాయి.

ఇళ్లపై, ఖాళీ స్థలాల్లో కూరగాయలు, పండ్లు పండించడం వల్ల మరొక పెద్ద ప్రయోజనం ఉంది. గ్రామాల్లోని వ్యవసాయ భూములు, అందుబాటులో ఉన్న సారవంతమైన పొలాలపై కూరగాయల సాగు భారం తగ్గుతుంది. దీనివల్ల ఆ భూములన్నింటినీ దేశానికి అత్యంత కీలకమైన ప్రధాన ఆహార పంటలైన వరి గోధుమలు, మరియు పప్పుధాన్యాల సాగుకు పూర్తిగా ఉపయోగించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది మన దేశ ప్రధాన ఆహార భద్రతను బలోపేతం చేస్తుంది. ఇటీవల కాలంలో భారతీయ వంటకాల్లో నూనె వాడకం చాలా పెరిగింది. దీనివల్ల ఆరోగ్యపరమైన ముప్పులతో పాటు, వంటనూనెల దిగుమతి కోసం దేశం వేల కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని కోల్పోతోంది. నూనె వినియోగాన్ని తగ్గించడం కేవలం కుటుంబ ఆర్థిక పరిస్థితికి మాత్రమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఎంతో మేలు చేస్తుంది. ప్రతి పౌరుడు నూనె వాడకంపై నియంత్రణ కలిగి ఉండాలి. ఇది ఊబకాయం, గుండె జబ్బులు వంటి అనారోగ్య సమస్యలను తగ్గించడంలోనూ కీలకపాత్ర పోషిస్తుంది. తిరిగి మనం సంప్రదాయ భారతీయ వంటకాలవైపు దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది



'స్వయం సమృద్ధి' అనేది ఒక్కరోజులో సాధించేది కాదు. అది ప్రతిపౌరుడి బాధ్యతతో కూడిన నిరంతర ప్రక్రియ. మన అవసరాల కోసం మనం ఇతరులపై ఆధారపడే పరిస్థితి మారాలి. ప్రతి ఇల్లూ స్వయంప్రతిపత్తి సాధిస్తే, దేశం తనంతట తానుగా శక్తివంతంగా మారుతుంది.

- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# యువత భవితకి.. భరోసా

## -జెన్‌జీ విద్యార్థులతో ఎంపీ విపిఆర్ భేటీ



యువత భవితకి భరోసా ఇస్తూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయగిరి, కోవూరు నియోజకవర్గాల్లో విపిఆర్ అధ్యక్షతన 'యువత భవితకు భరోసా' కార్యక్రమాలు పెద్దఎత్తున జరిగాయి. ఉదయగిరి నియోజకవర్గం వింజమూరులోని నేతాజీ డిగ్రీ కళాశాల, కోవూరు నియోజకవర్గం నార్త్‌రాజుపాలెంలోని శశికాంత్ ఫార్మసీ కళాశాలల్లో విద్యార్థులతో ఆయన నేరుగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా చేపట్టిన డీఎస్సీ ప్రక్రియపై వైసీపీ నాయకులు అనవసర ఆరోపణలు చేస్తూ యువత ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన నేరుగా సమాధానాలిచ్చారు. వరికుంటపాడు నుంచి జంగంరెడ్డిపల్లికి కిలోమీటరు రోడ్డు నిర్మించాలని ఓ విద్యార్థిని కోరగా, విపిఆర్ తక్షణమే స్పందించారు. ప్రభుత్వం తరపున కానీ, లేదా వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా కానీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొండాపురం నుంచి వింజమూరుకు బస్సు సౌకర్యం లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను విద్యార్థులు తెలపగా, వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సదుపాయం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగాలు అంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే కాదని, సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రైవేట్ రంగంలోనూ భారీగా ఉద్యోగాలు సృష్టించడం జరుగుతోందని ఎంపీ తెలిపారు. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ఇప్పటివరకు 7 లక్షల ఉద్యోగాలు కల్పించారని, ఇటీవలే దాదాపు 2 వేల పోలీసు ఉద్యోగాలు, 900 ఉద్యోగాలకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు విడుదల అయ్యాయని చెప్పారు. వైసీపీ తమ తప్పుడు ప్రచారాల కోసం 'జెన్-జీ' యువతని వాడుకోవాలని చూసిందని, అయితే నేటి యువతకు ప్రశ్నించే తత్వంతో పాటు 40 ఏళ్ల విజన్ ఉన్న చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిపై పూర్తి నమ్మకం ఉందని ఆయన అన్నారు. అసత్య ప్రచారాలను జెన్-జీ నమ్మదన్నారు. నెల్లూరు జిల్లాలో పలు పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.



### టీడీపీపై వైసీపీ విమర్శలు అనైతికం!

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నియామకాల్లో భారీ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేసే నైతిక హక్కు లేదని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కందుకూరులోని టీఆర్ఆర్ డిగ్రీ కళాశాల, వివేక డిగ్రీ కళాశాల, కావలిలోని జవహర్ భారతి కళాశాల, నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాలలో నిర్వహించిన 'యువత భవితకు భరోసా' కార్యక్రమాల్లో ఆయన పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెగా డీఎస్సీపై వైసీపీ విమర్శలను నమ్మొద్దని, ప్రతి దశలో ప్రభుత్వం పారదర్శకత పాటించడం జరిగిందని యువతకు స్పష్టం చేశారు. కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఓ విద్యార్థిని కోరిక మేరకు తరగతి గదుల సౌకర్యార్థం వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా 40 సీలింగ్ ఫ్యాన్లను అందజేస్తున్నట్లు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు. కళాశాలలో విద్యార్థుల చిరకాల కోరికైన ఎన్‌సీసీ యూనిట్‌ను త్వరలోనే పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

# చక్కెర ఫ్యాక్టరీ కార్మికులకు..తీపి కబురు!

## • మాట నిలబెట్టుకున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

***ఏళ్ల తరబడిగా కాని పని ఇప్పటికి సాధ్యమైంది. ఎట్టయితేనేం తాజాగా కోవూరు షుగర్‌ఫ్యాక్టరీ రైతులకు, కార్మికులకు తీపి కబురు అందింది. దాదాపు 11 ఏళ్ల షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం లభించడంతో చెరకు రైతులు, కార్మికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో ఈ ఫ్యాక్టరీకి సంబంధించి సుమారు 22 కోట్ల వేతన బకాయిలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విడుదల చేయడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రశాంతిరెడ్డి షుగర్‌ఫ్యాక్టరీ రైతుల, కార్మికుల సమస్యలు తీరుస్తానంటూ గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లయింది.***



కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించి కోట్లాది రూపాయల వేతన బకాయిలు ఇక వస్తాయో రావో అనుకుంటున్న తరుణంలో, ఆ బకాయిల చెల్లింపుకు ప్రభుత్వం ముందుకు రావడం విశేషం. సెప్టెంబరు 27న నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఈ విషయమై మాట్లాడుతూ, తనకు మొదటిసారి ఎమ్మెల్యే టిక్కెట్ ప్రకటించిన తర్వాత లేగుంటపాడులో నిర్వహించిన సమావేశంలో షుగర్‌ఫ్యాక్టరీ కార్మికులు స్వయంగా వచ్చి తమ కష్టాలు వివరించారని, వారి ఆవేదనను చూసి ఆ సమస్యలు తీరేందుకు మాటిచ్చానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బకాయిలు ఇప్పిస్తానని కూడా చెప్పానని అన్నారు. అనుకున్నట్లుగానే 'అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు నాయుడు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి పలుమార్లు ఈ విషయమై సుదీర్ఘంగా చర్చించామని, తాను స్వయంగా అసెంబ్లీ వేదికగా కార్మికుల సమస్యలు వినిపించానని ఆమె తెలిపారు. అయితే, అనుకున్న సమయానికి కొంత ఆలస్యమైనా, ముఖ్యమంత్రి సహకారంతో, ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికి బకాయిలు చెల్లించగలిగామని, ఎన్నో ఏళ్లుగా మిగిలిపోయిన సమస్యలను తీర్చడం ఒక్క కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. షుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్తుపై కూటమి ప్రభుత్వం త్వరలోనే అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకోబోతోందని ఎమ్మెల్యే చెప్పారు. 'కోవూరు నియోజకవర్గ రైతాంగానికి, ప్రజలకు, ఇక్కడి యువతకు ఉపాధి కల్పించేలా ఈ ప్రాంత భవిష్యత్తును మార్చే వినూత్న నిర్ణయాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో తీసుకోబోతున్నామని ఆమె వివరించారు.

## పేదల కోసం..

# మరో అంతర్జాతీయ స్థాయి పాఠశాల

## ○ శ్రీకారం చుట్టిన మంత్రి నారాయణ


భూమి పూజ చేస్తున్న మంత్రి నారాయణ, షరణి

నెల్లూరు నగర నియోజకవర్గంలో విద్యా విప్లవానికి మరో అడుగు పడింది. పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో నగరంలోని వెంకటేశ్వరపురం టిడ్కో ఇళ్ల ప్రాంగణంలో మరో అధునాతన పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సెప్టెంబరు 26న శ్రీకారంచుట్టారు. రూ. 39 కోట్ల సీఎస్ఆర్ నిధులతో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాల భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. వీఆర్ హైస్కూల్ తరహాలో నెల్లూరు నగరంలో మరో 17 ప్రభుత్వ పాఠశాలలను సుమారు రూ. 300 కోట్లతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తాను కూడా ఒకప్పుడు పేదరికాన్ని అనుభవించానని, తాటాకు గుడిసెలో పుట్టి పెరిగానన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదువుకుని అంచెలంచెలుగా ఎదిగానని తెలిపారు.తన లాంటి ఇబ్బందులు పేద పిల్లలకు రాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నానన్నారు. 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీప్లస్ 1 భవనం, 43 తరగతి గదులు ఇక్కడ ఏర్పాటు కానున్నాయని, స్విమ్మింగ్ పూల్, వివిధ క్రీడలకు అవసరమైన వసతులతో కూడిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. తాను వీఆర్ హైస్కూల్‌లో చదివి, అదే కాలేజ్‌లో నెలకు రూ. 120 జీతానికి పనిచేశానని గుర్తుచేశారు. మంత్రి కుమార్తె షరణి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## గాయపడిన విద్యార్థినులకు..

# సోమిరెడ్డి పరామర్శ



తోటపల్లిగూడూరు మండలం మహాలక్ష్మీపురం వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన కోడూరు గురుకులం విద్యార్థినులను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. పదో తరగతి విద్యార్థినులు ప్రయాణిస్తున్న ఆటోను మరో ఆటో ఢీకొనడంతో 8 మంది విద్యార్థినులతో పాటు ఓ ఉపాధ్యాయురాలికి గాయాలు తగిలాయి. నెల్లూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి పరామర్శించి, వారి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. దేవుడి దయవల్ల ఎవరికీ పెద్దగా ప్రమాదం లేదని ఆయన తెలిపారు.

# రెడ్‌క్రాస్‌లో 'రేబిస్' అవగాహన దినం

ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 28న నెల్లూరులోని ఏఆర్‌వీ క్లినిక్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ మాజీ చైర్మన్ డా. ఏ.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, రేబిస్ ప్రాణాంతక వ్యాధి అయినప్పటికీ, సరైన అవగాహన మరియు సకాలంలో వైద్య చికిత్స ద్వారా పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. జంతువుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించడంతో పాటు, కుక్క కాటు వంటి సందర్భాల్లో ఎటువంటి ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. అడహాక్ కమిటీ సభ్యులు యాలమూరి రంగారావు, చమర్తి జనార్ధన్‌రాజు, పాదర్తి నాగరాజు, రెడ్ క్రాస్ జిల్లా శాఖ సెక్రెటరీ పి.మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం పడారుపల్లిలో కుక్కల సంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఉమాదేవి సేవలను అభినందిస్తూ సత్కరించి, ప్రశంసాపత్రం అందజేశారు. తదుపరి పాములు తదితర ప్రమాదకర జంతువులను సురక్షితంగా పట్టుకుని ప్రజలకు సేవలందిస్తున్న చంద్రశేఖర్‌ని సన్మానించారు.

## 'నారాయణ'లో..
## మెగా జాబ్ మేళా

నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో సెప్టెంబరు 29న మెప్మా ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే తొలిసారిగా మెప్మా ఆధ్వర్యంలో వరుసగా అయిదురోజులు జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. జాబ్‌మేళాలో వివిధ సంస్థల వారు పాల్గొని, అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నారని, మంగళవారం రోజు 70మందికి పైగానే ఉద్యోగాలకు ఎంపికయ్యారని, మొత్తంగా నాలుగు రోజుల్లోనే 810 మందికి ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారని తెలిపారు.

## చేనేతలు ఉద్యమించాలి

చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోతోందని, ఎంతోమంది నేత కార్మికులు సమస్యల సుడిలో పడి నిత్యం నానా బాధలు పడుతున్నారని, అయినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం విచారకరమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సత్యనారాయణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 227న నెల్లూరులో జరిగిన ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 14వ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ, చేనేత రంగాన్ని కాపాడుకునేందుకు నేతకార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పముజుల హరి, సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి, మాజీ కార్యదర్శి ఎం. పార్ధసారథి, మహిళా నాయకురాలు కామేశ్వరి, జి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు కొండాయపాళెం సెక్టార్ పరిధిలోని పడారుపల్లిలో సెప్టెంబరు 29న ఐసీడీఎస్ సీడీపీఓ అరుణ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ చక్రవర్తి, సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

### నగరంలో ఒక్కరోజే ..
## 7.59 కోట్ల పనులకు శ్రీకారం
### • మంత్రి నారాయణ చొరవ



అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. ఈనెల 28వ తేదీ సోమవారం మంత్రి డాక్టర్ నారాయణ నగరంలోని పలు డివిజన్లలో విస్తృతంగా పర్యటించి రూ. 7.59కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రహదారులు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, గ్రీనరీ, పార్కులు, ఫౌంటైన్లతో పాటు క్రీడా సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. 52వ డివిజన్ రంగనాయకుల పేట పెద్దమసీదు సెంటర్‌లో రూ. 39 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి భూమిపూజ చేశారు. 54వ డివిజన్ జనార్ధన్‌రెడ్డి కాలనీలో రూ. 1.70 కోట్లతో డివైడర్, సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. నగరంలోని ఎండ్‌టు ఎండ్ రోడ్లన్నింటినీ త్వరలో పూర్తి చేస్తామన్నారు. శంకుస్థాపన చేసిన పనులన్నీ రెండునెలల్లో పూర్తిచేసేలా అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. 53వ డివిజన్ వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ కింద రూ. 4 కోట్లతో చేపట్టనున్న గ్రీనరీ, బ్యూటిఫికేషన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. గాంధీ గిరిజన కాలనీలో రూ. 1.50 కోట్లతో నూతన పార్కు పనులను ప్రారంభించారు. ముత్తుకూరుగేట్ సెంటర్‌లో ఆనం వెంకటరెడ్డి విగ్రహం వద్ద ఫౌంటైన్ పనులకు శంకుస్థాపన చేశారు.

### ప్రజలకి మేలు చేసేవారే..
## అసలైన నాయకులు



జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

పదవి ఉన్నా లేకున్నా ప్రజలకి మేలు చేసేవారే అసలైన నాయకులని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల నెల్లూరులోని విపిఆర్ కార్యాలయంలో కోవూరు నియోజకవర్గంలో ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు జడ్పీటీసీలు, 17 మంది ఎంపీటీసీలను ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాసేవలోనే సంతృప్తి ఉంటుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానంలోనూ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## జడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్



నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్, సభ్యుల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నియమితులయ్యారు. సెప్టెంబరు 25న ఆయన జిల్లా ప్రజా పరిషత్‌కు సంబంధించిన పరిపాలనా బాధ్యతలను కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిణి వసుమతి, పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## అన్న క్యాంటీన్లను తనిఖీ చేసిన కమిషనర్



నీటి వసతిని పరిశీలిస్తూ..

నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ నందన్ సెప్టెంబరు 29న నగరంలోని అన్నా క్యాంటీన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక మద్రాసు బస్టాండు వద్ద ఉన్న క్యాంటీన్‌కి వెళ్ళి, అక్కడ అన్నం, తదితర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పారిశుద్యం, తాగునీటి సరఫరా, టోకన్ల మంజూరు వగైరాలు ఎలా ఉన్నాయో చూసి, అక్కడ ఉన్నవారిని వాటి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్‌లలో నిత్యం అనేకమంది ప్రజలు భోజనం చేస్తుంటారు కనుక, అక్కడంతా పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. తొలుత, కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ భవనం నుంచి సచివాలయాల సిబ్బందితో జూమ్ మీటింగ్‌లో మాట్లాడి, నగరంలో జరుగుతున్న చెత్త సేకరణకి సంబంధించి పలు సూచనలిచ్చారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీరాజరాజేశ్వరిదేవి.. మాలధారణ



శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సెప్టెంబరు 29న నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి అధ్యక్షులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి మాలధారణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 19 సంవత్సరాలుగా అమ్మవారి శరన్నవరాత్రులకు పెద్ద సంఖ్యలో భక్తులతో అమ్మవారి మాలధారణ కార్యక్రమం చేపడుతున్నామని, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 20వ వార్షికోత్సవం సందర్భంగా మరింత వైభవంగా అమ్మవారికి పూజలుంటాయన్నారు. అక్టోబరు 17న పినాకినీ తీరం నుండి ఆలయం వరకు కలశాల ఊరేగింపు ఉంటుందని, 19న ఇరుముడి కార్యక్రమం చేపడతామని చెప్పారు. అనంతరం సాయంత్రం అనివెట్టి మండపంలో అమ్మవారికి పూల అలంకరణ చేసి కాత్యాయని వ్రతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నూతలపాటి శ్రీధర్‌నాయుడు, ఆలయ ఛైర్మెన్ ఏలూరు శిరీష, ధర్మకర్తలమండలి సభ్యులు పర్యవేక్షించారు.

## డ్రగ్స్‌కి దూరంగా ఉండాలి

డ్రగ్స్ (మాదకద్రవ్యాలు) వినియోగంతో జీవితాలు సర్వనాశనం అవుతాయని, విద్యార్థులు-యువకులంతా వాటికి దూరంగా ఉండాలని నెల్లూరు-1 ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రమేష్ బాబు స్పష్టం చేశారు. సెప్టెంబరు 29న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాలలో ఫిజియాలజీ విభాగం ఆధ్వర్యంలో, మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు మాదకద్రవ్యాల పట్ల కలిగే దుష్ప్రభావాలను ఆయన వివరించారు. వాటి నివారణకి యువత నడుం బిగించాలన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కి దూరంగా ఉంటామంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఎక్సైజ్ సిబ్బంది, ఈగల్ టీమ్ అధికారులు పాల్గొన్నారు.

## జీజీహెచ్ సూపరింటెండెంట్‌కి ప్రమోషన్

నెల్లూరులోని సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ కొండేటి మాధవికి ఉద్యోగోన్నతి లభించిందిమెడికల్ ఎడ్యుకేషన్ గ అడిషనల్ డైరెక్టర్‌గా ఆమెని నియమిస్తూ ప్రభుత్వం సెప్టెంబరు 29న ఉత్తర్వులిచ్చింది. దీంతో పాటు అడిషనల్ డీఎంఇ హోదాలో నెల్లూరు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కూడా ప్రభుత్వం కొనసాగించడంతో ఆమె ఇక్కడే విధులు కొనసాగించనున్నారు.

## కలెక్టరేట్ వద్ద ఆందోళన

పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దుచేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. సెప్టెంబరు 29న నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడుతూ. 8వ వేతన సంఘ పరిధిలో సవరణ చేయాలని, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విడుదల చేయాలని ఆయన కోరారు. అనంతరం కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు బాబు రెడ్డి, ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య, జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్ పాల్గొన్నారు.

## 8న ధర్నా చేస్తాం

భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ, ఆ కార్మిక సంఘాలతో కలసి అక్టోబరు 8వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని సీఐటియు జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు తెలిపారు. సెప్టెంబరు 29న స్థానిక సీఐటియు కార్యాలయంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మికుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వాలు కృషిచేయాలని డిమాండ్ చేశారు.




## ఇళ్ళ రిజిస్ట్రేషన్ కోసం సీపీఎం ధర్నా




నెల్లూరులోని వైఎస్సార్‌నగర వాసులకు ఇళ్ళకి రిజిస్ట్రేషన్ పట్టాలివ్వాలని కోరుతూ నెల్లూరు 30వ డివిజన్ సీపీఎం కొత్తూరుశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 29న ధర్నా చేపట్టారు. గత 20 ఏళ్ళుగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలు కాలనీల్లో ఉన్న పేదలకు ప్రభుత్వం మంజూరుచేసిన ఇళ్ళ పట్టాలను శాశ్వత పట్టాలుగా మార్చి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకులు, మాజీ డిప్యూటి మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, జిల్లా సీపీఎం కమిటీ సభ్యుడు పెంచలనరసయ్య, రూరల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పల్లెకి పండుగొచ్చింది!



## అల.. రామాపురానికి తరలివచ్చిన కూటమి నేతలు

నెల్లూరుజిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలంలోని రామాపురం గ్రామంలో 'పల్లె పండుగ' వాతావరణం వెల్లివిరిసింది. ఈ గ్రామం కూటమి నేతలకు వేదికైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌లు సెప్టెంబర్ 29వ తేదీన ఈ పల్లెపండుగ కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,085 కోట్ల రూపాయల పనులు చేపట్టనున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. నెల్లూరుజిల్లా వ్యాప్తంగా 520 కోట్ల రూపాయల పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఉదయగిరి నియోజకవర్గంలో 120కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా.. తాము ప్రజలకి సేవకులమే తప్ప పెత్తందార్లం కాదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడం ప్రజలను బాగా ఆకట్టుకుంది. ఎంతోకాలంగా అభివృద్ధికి నోచుకోని గ్రామాల బాగుకు పవన్‌కల్యాణ్ ఉద్యమ స్ఫూర్తితో కృషిచేస్తున్నారని ప్రశంసించడంతో ప్రజలు హర్షధ్వానాలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వేల కోట్ల రూపాయల వ్యయంతో పల్లెల ప్రగతికి ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నప్పుడు చప్పట్లు మిన్నుముట్టాయి.



ఎట్టకేలకి పల్లెకి పండుగొచ్చింది. ఏళ్ళతరబడిగా ఎదుగూబొదుగూ లేని గ్రామాల అభివృద్ధికి బాటలు పడ్డాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జంటనేతల ఆచరణాత్మక ఆలోచనలతో పల్లెలు కొత్త వెలుగులు సంతరించుకుంటున్నాయి. అందులోనూ గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో కుదేలైపోయిన గ్రామాలకు 'పల్లెపండుగ 3.0' కార్యక్రమం కొత్త ఊపిరి పోసి జవసత్వాలను నింపుతోంది. ముఖ్యంగా జిల్లాలో కరువు ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం రూపురేఖలే మారేవిధంగా కూటమి నేతలు భారీ బడ్జెట్‌ని కేటాయించి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. బీజేపీ నేత మాధవ్ మాట్లాడుతూ, చంద్రబాబు దార్శనికత్వంతో గ్రామాలకు కొత్త కళ వస్తోందన్నారు. ప్రధాని మోడీ సారధ్యంలో గ్రామీణప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు సమకూరుతున్నాయని, 'వీబీ జీ రామ్‌జీ' పేరుతో దేశవ్యాప్తంగా గ్రామీణ వికాసానికి అడుగులు పడుతున్నాయని చెప్పారు. ఉదయగిరిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు.

### జిల్లా నేతల్లో వెల్లువెత్తిన ఆనందం

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలో ఉదయగిరి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పల్లెల్లో రోడ్లు, ఇతర సౌకర్యాలు ఏర్పడుతుండడంతో జిల్లా నేతలు, నియోజకవర్గ ప్రజల్లో సంతోషం వెల్లువెత్తుతోంది. రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలతో పాటు పార్లమెంటు, రాజ్యసభ సభ్యులు, జిల్లాకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అన్ని శాఖల అధికారులు ఈ పల్లెపండుగలో పాల్గొన్నారు.

ముఖ్యంగా, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో 'పల్లెపండుగ' కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతం కావడంతో నియోజకవర్గ ప్రజలు ఆనందించారు. జిల్లా నేతలు, కూటమి నాయకులు కాకర్లను అభినందించారు. సభానంతరం నేతలు కాకొల్లువారిపల్లెలో జరుగుతున్న పనులు పరిశీలించి గ్రామస్తులతో ఫోటోలు దిగారు.

### ఫ్లోరైడ్ బాధలకి త్వరలోనే విముక్తి

ఉదయగిరి నియోజకవర్గంలోని అనేక గ్రామాల ప్రజలను ఎంతోకాలంగా పట్టి పీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించేందుకు సుజల స్రవంతి పథకం ద్వారా 52 కోట్లు కేటాయిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పడంతో ప్రజల్లో సంతోషం మిన్నుముట్టింది. ఉదయగిరిలో పల్లెపండుగ ద్వారా ఇప్పటికే రూ.121 కోట్లతో 115 కి.మీ. మేర సీసీ, బీటీ రోడ్లు, 1,200కుపైగా నీటి కుంటలు, 348 గోకులాలు, 190కి పైగా నీటి తొట్లు, సుమారు 900 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు వంటి అభివృద్ధి పనులను పూర్తి చేశామని చెప్పారు. అదేవిధంగా, ఉదయగిరి కోటను చేరుకునేందుకు నాలుగు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రెండున్నర కోట్లు కేటాయిస్తున్నామని పవన్ చెప్పడంతో, ఉదయగిరి దుర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న జిల్లా ప్రజల కల.. త్వరలోనే సాకారం కానుంది.




















# తిరస్కరణలో దాగిన అవకాశం: విఫలతను విజయంగా మలిచే జీవన శక్తి!

మనిషి జీవితంలో విఫలతలు, తిరస్కరణలు (Failure & Rejection) అనేవి తప్పనిసరి. ఎవరి ప్రయాణంలోనైనా ఇవి ఒక దశలో ఎదురవుతాయి. కానీ వాటిని ఎలా స్వీకరిస్తామన్నదే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. విఫలత అనేది మన ప్రతిభకు ముగింపు కాదు. అది మన ప్రయాణానికి కొత్త ఆరంభం. తిరస్కరణ అనేది మన విలువను తగ్గించే తీర్పు కాదు. అది మన సామర్థ్యాన్ని పెంచే పాఠం. ఈ రెండు అనుభవాలు మనసును బలపరచే జీవన శక్తులు. వాటిని అర్థం చేసుకుని, వాటిని సానుకూల దిశగా మలచగలిగితే, మనం విజయాన్ని నిర్మించగలం. విఫలతను ఎదుర్కొన్నప్పుడు మనసులో మొదట వచ్చే భావం బాధ. ఆ బాధ సహజం. కానీ ఆ బాధను మనసులో నిలబెట్టుకుంటే అది మన ప్రయాణాన్ని ఆపేస్తుంది. ఒక యువకుడు పరీక్షల్లో విఫలమైతే, అతని మనసులో నిరాశ వస్తుంది. కానీ అదే యువకుడు ఆ విఫలతను పాఠంగా తీసుకుని, తన బలహీనతలను గుర్తించి, మరింత కృషి చేస్తే, అతని విజయం మరింత బలంగా ఉంటుంది. "విఫలత అనేది మన సామర్థ్యాన్ని పరీక్షించే అద్దం" అనే మాటలో ఉన్న లోతు యువత గ్రహించాలి.

తిరస్కరణ అనేది మన విలువను తగ్గించే తీర్పు కాదు. అది మన ప్రయాణంలో ఒక చిన్న అడ్డంకి మాత్రమే. ఒక యువతి ఉద్యోగానికి అప్లై చేస్తే, మొదటి ఇంటర్వ్యూలో తిరస్కరణ రావచ్చు. కానీ ఆ తిరస్కరణ ఆమె ప్రతిభను తగ్గించదు. అది ఆమెకు మరింత సిద్ధం కావడానికి ఒక అవకాశం. తిరస్కరణ అనేది మనలోని బలాన్ని వెలికితీసే శక్తి. మనం దాన్ని అర్థం చేసుకుంటే, అది మన ప్రయాణాన్ని ముందుకు నడిపిస్తుంది. విఫలతను ఎదుర్కొన్నప్పుడు మనం మనసును ప్రశ్నించాలి: "ఈ అనుభవం నాకు ఏమి నేర్పింది?'.. ఈ ప్రశ్న మనలోని స్పష్టతను పెంచుతుంది. ఒక విద్యార్థి తన ప్రాజెక్ట్‌లో విఫలమైతే, అతను తన తప్పులను గుర్తించాలి. విఫలత అనేది మన ఆలోచనను మెరుగుపరచే శక్తి.

తిరస్కరణను ఎదుర్కొన్నప్పుడు మనం మనసును బలపరచాలి. తిరస్కరణ అనేది మన ప్రయాణంలో ఒక చిన్న విరామం మాత్రమే. ఒక యువకుడు తన రచనను పత్రికకు పంపితే, అది ప్రచురించబడకపోవచ్చు. కానీ, అదే రచనను మరింత మెరుగుపరచి మళ్లీ పంపితే, అది ఒకరోజు ప్రచురించబడుతుంది. తిరస్కరణ అనేది మన కృషిని మెరుగుపరచే శక్తి. మనం దాన్ని అర్థం చేసుకుంటే, అది మన విజయాన్ని నిర్మిస్తుంది. విఫలతను ఎదుర్కొన్నప్పుడు మనం మనసులో ధైర్యాన్ని పెంచుకోవాలి. ధైర్యం అనేది విఫలతను జయించే శక్తి. ఒక యువతి తన స్టార్టప్‌ను ప్రారంభించి నప్పుడు మొదట్లో సమస్యలు రావచ్చు. కానీ, ఆమె ధైర్యంగా ముందుకుసాగితే, ఆమె ప్రయాణం విజయవంతమవుతుంది. ధైర్యం అనేది మనసులోని వెలుగు. ఆ వెలుగు విఫలతను జయిస్తుంది. తిరస్కరణను ఎదుర్కొన్నప్పుడు మనం మనసులో నమ్మకాన్ని పెంచుకోవాలి. నమ్మకం అనేది

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

తిరస్కరణను అవకాశంగా మార్చే శక్తి. ఒక యువకుడు తన సంగీత ప్రతిభను ప్రపంచానికి చూపాలని కోరుకుంటే, మొదట్లో అతనికి అవకాశాలు రాకపోవచ్చు. కానీ అతను తన ప్రతిభపై నమ్మకం ఉంచితే, ఒకరోజు అతని సంగీతం ప్రపంచాన్ని ఆకట్టుకుంటుంది. నమ్మకం అనేది మన ప్రయాణాన్ని ముందుకు నడిపించే శక్తి. ఇక్కడ ఒక చిన్న కథను గుర్తు చేసుకోవాలి. ఒక విద్యార్థి తన సైన్స్ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర స్థాయి పోటీలో ప్రదర్శించాడు. అతను ఎంతో కృషి చేశాడు. కానీ, అతని ప్రాజెక్ట్ ఎంపిక కాలేదు. మొదట అతను చాలా బాధపడ్డాడు. కానీ అతని గురువు అతనికి ఒక మాట చెప్పాడు: "విఫలత అనేది నీ కృషికి ముగింపు కాదు; అది నీ కృషికి కొత్త దిశ." ఈ మాట అతని మనసును మార్చింది. అతను తన ప్రాజెక్ట్‌ను మెరుగుపరచి మళ్లీ పోటీలో పాల్గొన్నాడు. ఈసారి అతని ప్రాజెక్ట్ మొదటి బహుమతి గెలుచుకుంది. ఆ రోజు అతను గ్రహించాడు. విఫలత అనేది విజయానికి పునాది. తిరస్కరణను ఎదుర్కొన్నప్పుడు మనం మనసులో శాంతిని పెంచుకోవాలి. శాంతి అనేది మన ఆలోచనను స్పష్టంగా చేస్తుంది. ఒక యువతి తన కళను ప్రపంచానికి చూపాలని కోరుకుంటే, మొదట్లో ఆమెకు గుర్తింపు రాకపోవచ్చు. కానీ ఆమె శాంతిగా, క్రమ బద్ధంగా, నిరంతరం కృషి చేస్తే, ఒకరోజు ఆమె కళ ప్రపంచాన్ని ఆకట్టుకుంటుంది. శాంతి అనేది మన ప్రయాణాన్ని సమతుల్యంగా నడిపించే శక్తి.

విఫలతను ఎదుర్కొన్నప్పుడు మనం మనసులో ఆశను పెంచుకోవాలి. ఆశ అనేది మన ప్రయాణాన్ని వెలిగించే దీపం. ఒక యువకుడు తన విద్యలో సమస్యలను ఎదుర్కొన్నప్పుడు, అతను ఆశను కోల్పోతే ప్రయాణం ఆగిపోతుంది. కానీ ఆశను నిలబెట్టుకుంటే, ప్రయాణం ముందుకు సాగుతుంది. ఆశ అనేది మనసులోని వెలుగు. తిరస్కరణను ఎదుర్కొన్నప్పుడు మనం మనసులో కృతజ్ఞతను పెంచుకోవాలి. కృతజ్ఞత అనేది మన ప్రయాణాన్ని సానుకూలంగా మారుస్తుంది. కృతజ్ఞత అనేది మనసులోని శాంతి. చివరగా, విఫలత మరియు తిరస్కరణ అనేవి మన జీవితంలో తప్పనిసరి. కానీ వాటిని ఎలా స్వీకరిస్తామన్నదే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. విఫలతను పాఠంగా తీసుకుంటే అది మన ప్రయాణాన్ని ముందుకు నడిపిస్తుంది. తిరస్కరణను అవకాశంగా తీసుకుంటే అది మన విజయాన్ని నిర్మిస్తుంది. విఫలత అనేది మన సామర్థ్యాన్ని వెలికితీసే శక్తి. తిరస్కరణ అనేది మన కృషిని మెరుగుపరచే శక్తి. ఈ రెండు శక్తులను అర్థం చేసుకుని, వాటిని సానుకూల దిశగా మలచగలిగితే, మనం విజయాన్ని నిర్మించగలం. విఫలతను జయించే ధైర్యం, తిరస్కరణను అవకాశంగా మార్చే మనసు..ఇవి యువతకు జీవితాంతం ఉపయోగపడే ఆస్తులు. ఈ ఆస్తులను పెంపొందించుకోవడం యువత చేతుల్లోనే ఉంది.

**వచ్చే వారం :** ప్రేరణ కదిలిస్తుంది, క్రమశిక్షణ నిలబెడుతుంది: విజయాన్ని నిర్మించే ద్వంద్వ శక్తులు!



E-mail: reddyu@gmail.com

# జొన్నవాడను దర్శించుకున్న.. హైకోర్టు న్యాయమూర్తి



జిల్లాలోని ప్రముఖ దేవస్థానం జొన్నవాడ శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానాన్ని సెప్టెంబరు 27న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎస్.సుబ్బారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనను ఆలయ మర్యాదలతో స్వాగతించి, శ్రీ స్వామి-అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు వేద పండితులు, వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాయలసీమ గొంతుక..విద్వాన్ విశ్వం

## - - - 'ధాత్రి' టీవీ అధినేత పమిడికాల్వ మధుసూదన్ - - -



మధుసూదన్‌ని సత్కరిస్తున్న వేదవిజ్ఞాన వేదిక నిర్వాహకులు

విద్వాన్ విశ్వం సాహితీ రంగంలో ఓ వెలలేని ఆణిముత్యమని, కరువులతో అలమటించే రాయలసీమ ప్రజల కన్నీటి గాథలను, 1953 నాటి భయంకరమైన కరువును 'పెన్నేటిపాట'గా రచించి రాయలసీమ గొంతుకగా వారి బాధలను లోకానికి చాటారని ప్రముఖ రచయిత, పాత్రికేయుడు..'ధాత్రి' టీవీ అధినేత పమిడికాల్వ మధుసూదన్ కీర్తించారు. చెన్నైలోని 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో సెప్టెంబరు 27న జరిగిన 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహికలో భాగంగా, 177వ ప్రసంగంగా 'సాహితీ విరూపాక్షుడు విద్వాన్ విశ్వం' అనే అంశంపై ఆయన అద్భుతంగా ప్రసంగించి వేదిక వారి సత్కారం అందుకున్నారు. 'అదే పెన్న..అదే పెన్న, నిదానించి నడు..అది వొట్టి ఎడారి తమ్ముడూ' అంటూ ఆయన రాసిన పెన్నేటిపాట సాహితీలోకంలో ఓ అమరకావ్యంగా నిలిచిందని మధుసూదన్ తెలిపారు. టీటీడీ ప్రచురణల విభాగం అధిపతిగా కూడా ఆయన పనిచేసి ఎన్నో అమూల్యమైన రచనలను వెలికి తెచ్చారన్నారు. పత్రికా సంపాదకునిగా, కవిగా, రచయితగా, అనేక సంస్కృత కావ్యాలను ఆంధ్రీకరించిన భాషాపండితునిగా, విద్వాన్ విశ్వం అక్షరసేవలు అపారమన్నారు. అనంతరం, వేదిక అధ్యక్ష కార్యదర్శులు జేకేరెడ్డి, కార్యదర్శి కందనూరు మధు పాల్గొని, వక్త మధుసూదన్‌ను జ్ఞాపిక, శాలువతో సన్మానించారు.

# పాణిగ్రహణం

అదో సుప్త చైతన్యం
చరిత్రలో మొలకలెత్తిన
సరికొత్త అధ్యాయం
కోట్ల నోట్ల కట్టల నగిషీలు
తులాభారాలు
తూగుటుయ్యాలలు పట్టుపరువుల
సోయగాలు
అత్తరుల పొత్తాలు, విలాసవనాలు
విరియని దాంపత్య జీవనం
వికసించదు
అక్కడ మగాడు పద్మవ్యూహాంలో
చిక్కుకొన్న పగాడు.

అయిదంకెల కొలువుల జాతరలో
వెలిగే నక్షత్రాలపై తప్ప
ఆమ్మెస్టీ మూపని రాతి గుండెలవి
పెళ్ళికాని ప్రసాదులు
తాటితోపుల్లో చెట్లకు మల్లే
దిగులు జాడలవుతున్నాయి

వాళ్ళ ఆలోచనల్లో
సూర్యోదయమయింది
పనికిరాదన్న తుక్కు నేటి మేటి
అగ్రవ్యాపార వస్తువయింది.
అనాథశరణాలయాలు
ఆపన్నుల కరచాలనంతో

భాగ్యశీలుర ఆగమనంతో
అపూర్వ ఆత్మగౌరవ సంకేతమై
ఆత్మీయ సంగమ కేతనాలయ్యాయి.

తోడు నీడగా నడిచే
జెన్‌జీ యువత
మేధోమథన సంపన్నత
అనాథను అనురాగ సంద్రంగా
తీరిదిద్దిన నవోన్మేష వసంతం

జీవితాల్ని
అంకెలతో కొలిచి ప్రస్థానించే
సంపన్నతే లెక్కలకు మూలధనమన్న
మరీచికల వెంట పయనించే
మనోభావాలకు గొడ్డలిపెట్టు

అతడు కట్టే తాళి
ఆమె మెడకు అలంకారం కాదు
ఈ సమాజ వ్యవస్థకు ఉరితాడు

రామపాదం తగిలి
రాయి ఆడది అయితే
ఆమె అడుగుల సవ్వడితో
ఆ ఇల్లు జాగృత
జీవనవేదం అయ్యింది!



'కళారత్న'
చిన్ని నారాయణరావు
94402 02942

# నిధుల గోల్‌మాల్‌పై..
# విచారణ జరిపించండి

## వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న లీలామోహన్

జిల్లాలోని సోమశిల ప్రాజెక్టు దక్షిణ కాలువ పనులకు కేటాయించిన నిధుల గోల్‌మాల్‌పై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు లీలామోహన్ డిమాండ్ చేశారు. ఈనెల 27న నెల్లూరులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం కోట్లాదిరూపాయల నిధులను సాగునీటి వనరుల కోసం కేటాయిస్తుంటే, వాటిని సక్రమంగా వినియోగించకపోవడం దారుణమన్నారు. కలువాయి, చేజర్ల మండలాల్లోని కాలువల పరిస్థితి కూడా ఇలాగే తయారయ్యిందని వారు ధ్వజమెత్తారు. రైతు సంఘం అధ్యక్షుడు షానవాజ్, రైతు నాయకులు సుబ్రహ్మణ్యం, మున్వర్, జనార్దన్, పముజుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# జాషువా రచనలు అద్వితీయం



మహాకవి గుర్రం జాషువా రచనలు అద్వితీయమని, వర్ధమాన రచయితలకు మార్గదర్శకమని వక్తలు ప్రశంసించారు. ఈనెల 27న ఆ మహనీయుని 132వ జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాషువా రచనలైన 'గబ్బిలం', 'ఫిరదౌసి' తదితర రచనల విశిష్టతను వివరించారు. పెరసం అధ్యక్షులు అవ్వారు శ్రీధరబాబు, కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి, విశ్రాంత ఏఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు, కవులు మోపూరు పెంచలనరసింహం, అన్నం శివకృష్ణ, దుప్పటి రమేష్‌బాబు, కుని అంకబాబు, హస్తి లక్ష్మణ్‌రాజు, కవయిత్రులు తోట సులోచన, నాగ గాయత్రి, పార్లపల్లి నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భావితరాలకు మనం ఇచ్చే సంపద.. చెట్లే!

## - యువనాయకుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి -



మొక్కలు నాటుతున్న సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి - శృతి దంపతులు

భావితరాల వారికి మనం ఇచ్చే సంపద చెట్లేనని యువ నాయకుడు, సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ నేత సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో కీలకమైన మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన చెప్పారు. ఇటీవల తోటపల్లి గూడూరు మండలం నరుకూరులో బీవీఎస్ స్టార్ సిటీ శేషయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి-శృతి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతోందని, ప్రజలు ఇంకా ఏం కోరుకుంటున్నారో తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామన్నారు. ప్రజలకు సోమిరెడ్డి కుటుంబం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ నూటికి నూరుశాతం విజయం సాధించే లక్ష్యంగా దిశగా ఈ పర్యటనలు చేస్తున్నామన్నారు. యువత రాజకీయాల్లో ఎంతో ఉత్సాహంగా పనిచేయడం శుభపరిణామమని, ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్ధిచేకూర్చడంలో యువత కీలకపాత్ర పోషించాలని కోరారు. శేషయ్యను స్ఫూర్తిగా తీసుకుని పర్యావరణానికి ప్రయోజనం కలిగించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని వారు ఆకాంక్షించారు.

# సుపరిపాలన అందిస్తున్న ప్రధాని మోడీ

## 'సేవాసంకల్ప్'లో బీజేపీ నాయకులు

ప్రధాని మోడీ దేశానికి సుపరిపాలన అందిస్తున్నారని, ఒకవైపు ప్రజాసంక్షేమం.. మరోవైపు దేశభద్రత గురించి నిరంతరం ఆలోచిస్తూ, ప్రపంచానికే మనదేశాన్ని 'విశ్వగురువు'గా చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారని బీజేపీ, బీజేవైం నాయకులు కొనియాడారు. ప్రధాని మోడీ పుట్టినరోజును పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెంలో సెప్టెంబరు27న అర్బన్ బీజేవైఎం అధ్యక్షుడు తానా మణిశంకర్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేయగా, 105 మంది రక్తదాతలు రక్తదానం చేశారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జిల్లా భారతీయ యువ మోర్చా (బీజేవైం) అధ్యక్షుడు భరత్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ, ప్రధానిగా నరేంద్ర మోడీ దేశానికి చేస్తున్న సేవలు అపారమని, ప్రజల సంక్షేమం కోసం కోట్లాదిరూపా యల పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తూ దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నా రని ప్రశంసిస్తూ, కృతజ్ఞతలు తెలిపారు.



# ఎన్‌బీకేఆర్‌లో.. నేవల్ కేడెట్ల ఎంపిక

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో 10-ఏ నేవల్ యూనిట్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో ఇటీవల ఎన్‌సిసి క్యాడెట్ల ఎంపిక జరిగింది. ఖాళీగా ఉన్న 17 సీట్లను భర్తీ చేశారు. నేవల్ ఎన్‌సిసి యూనిట్ కార్యాలయం నుంచి పీఐలు లక్ష్మణరావు, పృధ్వీరాజ్‌లు ఈ ఎంపిక ప్రక్రియని నిర్వహించారు. ఎన్‌సిసి ఎన్‌ఓ..సబ్ లెఫ్టినెంట్ డా. వి.మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు. మొత్తం 81మంది విద్యార్థులు ఎంపిక పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 60 మంది విద్యార్థులు, 21 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.శ్రీనివాసులు ఈ ఎంపిక కార్యక్రమాన్ని అభినందిస్తూ, నేవల్ ఎన్‌సిసిలో చేరడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావం, ఆత్మవిశ్వాసం మరియు శారీరక ధృఢత్వం పెంపొందుతాయని తెలిపారు. ఎంపికయ్యే విద్యార్థులు ఎన్‌సిసి శిక్షణను సద్వినియోగం చేసుకుని కళాశాలకు, సమాజానికి మరియు దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఎస్టీలుగా పరిగణించండి

## మంత్రి ఆనంకి వాల్మీకి బోయల వినతి

తమన ఎస్టీలుగా పరిగణించి, ఎస్టీల జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ అభివృద్ధి సంక్షేమ సంఘం నాయకులు కామినేని శ్రీనివాస్ కోరారు. సెప్టెంబర్ 27న మంత్రి ఆనం నివాసంలో ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న బోయలు ఎస్టీ జాబితాలో, మైదానప్రాంతాల్లో ఉన్నవారు బీసీ-ఏ జాబితాలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.రాజీవ్‌గాంధీ, రమేష్, ఎం. వెంకటేశ్వర్లు, చిరంజీవి, ఆర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

---

# గూడూరు డివిజన్

# శివన్న మృతి తీరని లోటు

## ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

టీడీపీ సీనియర్ నాయకులు గోను శివకుమార్ లేని లోటు తీర్చలేదని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 7వ తేదీ గూడూరు పట్టణంలోని డి.ఎస్.ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన శివకుమార్ సంతాప సభకి హాజరైన ఆయన మాట్లాడుతూ టీడీపీకి శివన్న చేసిన సేవలు మరువలేనివన్నారు. ఎవరికి ఆపద వచ్చిన ముందు ఉండేవారని, ఆయన మనమధ్యన లేకపోవడం జీర్ణించుకోలేకపోతున్నా నని, ఆయన కుటుంబసభ్యులకు అండగా ఉంటామన్నారు. ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, చదలవాడ హరిప్రసాద్, శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచు రామయ్య, పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకి సి.ఆర్.రెడ్డి 'ఆసరా'



పలసరుకులు అందుకుంటున్న పేద రెడ్డి కుటుంబాల సభ్యులు

నిరుపేద రెడ్డి కుటుంబాలను ఆదుకునే క్రమంలో డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణిల దాతృత్వంతో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సి.ఆర్.రెడ్డి 'ఆసరా' కార్యక్రమం సెప్టెంబర్ 27వ తేదీ డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. గత ఐదు సంవత్సరాలుగా ప్రతి నెలా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 20మంది పేద రెడ్డి కుటుంబాలకి నెలకు సరిపడా పలసరుకులని అందజేశారు. అధ్యక్షులు మండి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి దేశిరెడ్డి ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పనులు నాణ్యతగా చేయాలి



మొక్కలు నాటుతున్న క్వాలిటీ కంట్రోల్ ఇ.ఇ.రాజశేఖర్, రియాజ్ అహ్మద్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పంచాయతీ రాజ్ శాఖ పనులలో నాణ్యతకి ప్రాముఖ్యత ఇస్తూ ప్రతి ఒక్కరూ పని చేయాలని పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ & అస్యూరెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్ కోరారు. నెల్లూరుజిల్లా ఇ.ఇగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి గూడూరుకు వచ్చిన సందర్భంలో ఆయన మాట్లాడడం జరిగింది. అనంతరం పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయంలో క్వాలిటీ కంట్రోల్ డిఇఇ బాబురావు ఆధ్వర్యంలో వివిధ రకాలైన చెట్లను నాటి, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, చెట్లను విరివిగా పెంచి కాలుష్యాన్ని నియంత్రించాలని కోరారు. గూడూరు పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, క్వాలిటీ కంట్రోల్ డిఈఈ బాబురావు, పి.ఆర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం దుకాణాలకి దరఖాస్తులు



లక్ష్మణస్వామి

2026-27 సంవత్సరానికి సంబంధించి గూడూరు డివిజన్ పరిధిలోని గూడూరు-9, వెంకటగిరి -5, సూళ్లూరుపేట-4, వాకాడు-1 మొత్తం 19 మద్యం షాపులకు 24వ తేదీ నుండి అక్టోబర్ 1 వరకు దరఖాస్తు లను తీసుకుంటామని ఎక్సైజ్ ఏ.ఈ ఎస్.లక్ష్మణస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు ఫీజు 3 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు 1000 రూపాయలు, మొత్తం మూడు లక్షల వెయ్యి రూపాయలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో చెల్లించవచ్చ న్నారు. అక్టోబర్ 5వ తేదీ జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో లాటరీ పద్ధతిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.



# మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచాలి

## సి.ఐ.టి.యు డిమాండ్

మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలంటూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 30వ తేదీన సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సి పల్ కార్మికులకు జీతాలు పెంచి 3 సంవత్సరాలపైబడుతున్నా.. జీతాల పెంపుపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, 12వ పి.ఆర్.సి కమిషన్ అమలు చేయాలని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంటుచార్జీలు రెట్టింపు అయ్యాయని, పిల్లల విద్యా ఫీజులు, వైద్య ఖర్చులు ఇంటి అద్దెలు అమాంతంగా పెరిగిపోయాయని.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన కోరికలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వై.మల్లికార్జున్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర నాయకులు దారా కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు డి.మణెమ్మ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వర్మీ కంపోస్ట్ తయారీపై అవగాహన



గ్రీన్ అంబాసిడర్లకి అవగాహన కల్పిస్తున్న అధికారులు

గూడూరు మండలం, పాలిచర్ల గ్రామంలోని సాలిడ్ వెస్ట్ ప్రాసెస్ కేంద్రంలో డిప్యూటీ ఎంపిడిఓ మోహన్, పి.డి.ఓలు.. గ్రీన్ అంబాసిడర్లకు వర్మీ కంపోస్ట్ తయారీపై ఇటీవల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాన పాములు, సూక్ష్మజీవుల సహాయంతో కూరగాయల వ్యర్థాలు, పేడను సేంద్రీయ పదార్థాలను కుళ్ళింప చేసి తయారుచేసే సహజమైన ఎరువు వర్మీ కంపోస్ట్ అన్నారు. దీనిని ఎలా తయారుచేసుకోవాలో గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కల్పించారు.

# హిమాన్షు!.. భేష్

## - కలెక్టర్‌కి సీఎం అభినందనలు -



నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం రామాపురంలో నిర్వహించిన 'పల్లె పండుగ' కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రసంగించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజా సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పరిపాలనా పనితీరుపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో పాటు జిల్లా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై నిర్వహించిన సంతృప్తి సర్వేల్లో నెల్లూరు జిల్లా మెరుగైన ఫలితాలు సాధించడం పట్ల సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర సగటు 70.05 శాతం కాగా, నెల్లూరు జిల్లా 74.31 శాతం మార్కులు సాధించి రాష్ట్ర సగటు కంటే మెరుగైన ఫలితాలు నమోదు చేసిందని పేర్కొన్నారు. అనంతరం ఈ నెలలో ఈ పనితీరు మరింత మెరుగుపడి 76.16 శాతానికి చేరడం పట్ల జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నాయకత్వాన్ని, జిల్లా యంత్రాంగం కృషిని సీఎం కొనియాడారు.

### ఇదే స్ఫూర్తితో పనిచేయాలి :

ప్రభుత్వ సేవలపై ప్రజల నుంచి నేరుగా ఫోన్ ద్వారా అభిప్రాయాలను సేకరిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆర్టీసీ, మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం తదితర సుమారు 50 అంశాలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు అందించే అభిప్రాయాల ఆధారంగానే అధికారుల పనితీరును అంచనా వేస్తున్నామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నెల్లూరు జిల్లా యంత్రాంగం సుపరిపాలనకు ఒక ఉదాహరణగా నిలుస్తోందని సీఎం పేర్కొన్నారు. ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించే అధికారులను ప్రోత్సహించి గౌరవిస్తామని తెలిపారు. అదే సమయంలో విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారుల విషయంలో ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. వెనుకబడిన ప్రాంతాలుగా ఉన్న ఉదయగిరి వంటి ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో మరింత మెరుగైన పనితీరు కనబరచాలని అధికారులకు సూచించారు. ప్రజా సంక్షేమం, సుపరిపాలన, అభివృద్ధి లక్ష్యాల సాధనలో జిల్లా అధికారులు ఇదే స్ఫూర్తితో నిరంతరం పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# గుండెను కాపాడుకుందాం..

## • అపోలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భక్తవత్సలరెడ్డి




జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ నందన్

గుండె ఆరోగ్యంపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని నెల్లూరులోని అపోలో స్పెషలిటీ హాస్పిటల్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి తెలిపారు. ప్రపంచ గుండె వ్యాధుల దినోత్సవం సందర్భంగా ఇటీవల అపోలో స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నగరంలోని ముత్తుకూరు బస్టాండ్ సెంటర్ నుండి అపోలో ఆసుపత్రి వరకు వాకథాన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నెల్లూరు మున్సిపల్ కమిషనర్ ఓ.నందన్ పాల్గొని జెండా ఊపి వాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అపోలో హాస్పిటల్స్ యూనిట్ హెడ్ విశ్వేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ షర్మిలీ, నాగభూషణం,కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ జైగణేశ్, అనస్థీషియన్ డాక్టర్ మధు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గుండె సంబంధిత వ్యాధులు ప్రధాన ఆరోగ్య సమస్యల్లో ఒకటిగా కొనసాగుతున్నాయని, అయితే ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, ప్రమాద కారకాల నియంత్రణ మరియు అవసరమైన సమయంలో వైద్య చికిత్స ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ జబ్బుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుండె సంబంధిత సమస్యలు కొన్నిసార్లు స్పష్టమైన లక్షణాలు లేకుండానే ప్రారంభమవుతాయని, ఛాతీలో అసౌకర్యం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అసాధారణ అలసట, తల తిరగడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత జీవనశైలిలో శారీరక శ్రమ తగ్గిపోవడం, ఎక్కువసేపు కూర్చోవడం, అనారోగ్యకరమైన ఆహారం, పొగాకు వినియోగం, అధిక ఒత్తిడి వంటి అంశాలు గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయన్నారు. పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, పప్పులు, గింజలు వంటి పోషకాహారాన్ని తీసుకోవడంతో పాటు అధిక ఉప్పు, అదనపు చక్కెరలు మరియు అనారోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉండే ఆహారాన్ని పరిమితం చేసుకోవాలని ఆయన సూచించారు. గుండెను కాపాడుకుంటూ అందరూ ఆరోగ్యంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

# దటీజ్ బీఎంఆర్ అనిపించారు..

# అనుకున్నది సాధించారు

## ఉప్పు రైతులకు..గొప్ప సాయం చేశారు



రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) ఎట్టకేలకు అనుకున్నది సాధించారు. ఎన్నో ఏళ్లుగా అల్లూరు సముద్రతీర ప్రాంతంలో ఉప్పును పండించే రైతులకు గొప్ప సాయాన్ని అందించారు. ఎంతోకాలంగా ఉన్న వారి సమస్యలకి పరిష్కారం చూపి దటీజ్ బీఎంఆర్ అనిపించుకున్నారు. అల్లూరు మండలం తీర ప్రాంత గ్రామాలైన తూర్పు గోగులపల్లి, పశ్చిమ గోగులపల్లి గ్రామ పంచాయతీలలో ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన ఉప్పు రైతుల ఉప్పు సాగు క్షేత్రాలకు మట్టి రహదారుల నిర్మాణానికి రూ.3.4 కోట్ల రూపాయలను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. బీఎంఆర్ విజ్ఞప్తి మేరకు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ సహకారంతో ఇటీవలే ఆ నిధుల కేటాయింపు జరగడం ఎంతైనా హర్షదాయకం. గోగులపల్లి గ్రామానికి భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రత్యేకమైన స్థానం ఉంది. సముద్రతీరానికి సమీపంలో ఉండటం, సంప్రదాయంగా ఉప్పు ఉత్పత్తి జరిగే ప్రాంతం కావడంతో 1930లో మహాత్మా గాంధీ పిలుపునిచ్చిన ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమానికి నెల్లూరు జిల్లాలో గోగులపల్లి ఒక ముఖ్య కేంద్రంగా నిలిచింది.

**చారిత్రక నేపథ్యం :** స్వాతంత్ర్యోద్యమ కాలంలో గోగులపల్లి ప్రజలు బ్రిటిష్ ప్రభుత్వం విధించిన ఉప్పు చట్టాన్ని వ్యతిరేకిస్తూ సత్యాగ్రహంలో పాల్గొని, ఉప్పు తయారీ ద్వారా వలస పాలనకు వ్యతిరేకంగా అహింసాయుత నిరసనను వ్యక్తం చేశారు. దాంతో అనేకమంది అరెస్టయి ఎన్నో కష్టాలనుభవించారు కూడా. ఈ నేపథ్యంలో మహాత్మా గాంధీజీ 1933 డిసెంబర్ 30న తన కోస్తా ఆంధ్ర పర్యటనలో భాగంగా అల్లూరును సందర్శించడం ఒక చారిత్రక ఘట్టం. నాటి నుంచి గోగులపల్లి తీర ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాలు కావడంతో ఇక్కడి ప్రజల్లో గణనీయమైన వర్గం ఉప్పు ఉత్పత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తోంది. అయితే, ఎంతోకాలంగా ఉప్పు క్షేత్రాలకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల ఉప్పును క్షేత్రాల నుంచి నిల్వ కేంద్రాలకు, అక్కడినుంచి మార్కెట్లకు తరలించడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు, ట్రాక్టర్లు ఉప్పు క్షేత్రాల వద్దకు చేరుకోలేకపోవడం వల్ల రైతులు చేతులతో ఉప్పును తరలించాల్సి రావడం, రవాణా వ్యయం పెరగడం, వర్షాలు, తీరప్రాంత వాతావరణ కారణంగా ఉప్పు పాడయ్యే ప్రమాదం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల రైతులు తమ ఉత్పత్తిని బహిరంగ మార్కెట్‌కు తీసుకెళ్లలేక, మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తోందని, దీని కారణంగా తక్కువ ధరలకు ఉప్పును విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఎంపీ బీద మస్తాన్‌రావుయాదవ్ ఆ సమస్యలను పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్ళారు. పవన్ వెంటనే స్పందించి, అవసరమైన ఆ నిధులను మంజూరు చేయడంతో కొత్త రహదారులు ఏర్పడితే ఉప్పు క్షేత్రాలకు వాహన రాకపోకలు సులభమై, మార్కెట్‌కు నేరుగా చేరుకునే అవకాశం పెరిగి, రైతులకు మెరుగైన ధర లభించే పరిస్థితులు ఏర్పడతాయంటూ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.బీఎంఆర్ ప్రతిపాదనలతో తూర్పు, పశ్చిమ గోగులపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 32 రహదారి పనులకు 18,900 మీటర్ల పొడవునా రోడ్డు ఏర్పాటుకానున్నాయి. దీంతో వేలాది మంది ఉప్పు రైతు కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలగడంతో పాటు, పరిసర గ్రామాలకు చెందిన సుమారు 3వేల మంది ప్రజలకు ఉప్పు ఉత్పత్తి ప్రక్రియ ద్వారా పరోక్ష ఉపాధి ప్రయోజనం లభిస్తుందని ఆశిస్తున్నారు. తమ సమస్యల పట్ల స్పందించిన బీఎంఆర్‌కి ఉప్పురైతులు కృతజ్ఞతలు తెలిపారు.



## కాంగ్రెస్

# నిరసన ప్రదర్శన

దేశంలో కోట్లాదిమంది ప్రజల ఓట్లు ప్రమాదంలో పడ్డాయని ఆరోపిస్తూ, అందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ..జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 30న నెల్లూరులో ఆందోళన జరిగింది. ఏఐసీసీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ ఆందోళనలో భాగంగా కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జేసీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థను, రాజ్యాంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు ఇర్ఫాన్, సీనియర్ నాయకురాలు డాక్టర్ యశోదర, సిటీ ప్రెసిడెంట్ అల్లాబక్షు పీసీసీ సభ్యులు పంట శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'రెయిన్‌బో'లో మూడేళ్ల చిన్నారికి..

# విజయవంతంగా కాలేయ మార్పిడి



అరుదైన సంక్లిష్టమైన వ్యాధి లాంగర్‌హాన్స్ సెల్ హిస్టియోసైటోసిస్ (ఎల్‌సీహెచ్)తో బాధపడుతున్న 3 ఏళ్ల చిన్నారికి చెన్నైలోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్యులు సెప్టెంబరు 30న విజయవంతంగా కాలేయ మార్పిడి నిర్వహించారు. పుట్టుకతోనే మూత్రపిండ సంబంధిత అసాధారణత కారణంగా చిన్నారికి పదేపదే మూత్ర నాళ ఇన్ఫెక్షన్లు రావడం ఈ చికిత్సను మరింత క్లిష్టం చేసింది. కాలేయ మార్పిడి ముందు అనేక వైద్య సమస్యలను పరిష్కరించాల్సిన క్రమంలో పలు వైద్య విభాగాల నిపుణుల సమన్వయం అవసరమైంది. కామెర్లతో వచ్చిన చిన్నారి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడం ద్వారా కాలేయ మార్పిడికి సిద్ధం చేయడంపై వైద్యులు దృష్టిసారించి ఎట్టకేలకి బాగు చేశారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు చెందిన పీడియాట్రిక్ నెఫ్రాలజిస్టులు, పీడియాట్రిక్ సర్జన్లు, హెపటాలజిస్టులు, పీడియాట్రిక్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు, పీడియాట్రిక్ హిమటో-ఆంకాలజిస్టులు మరియు పీడియాట్రిక్ ఇంటెన్సివిస్టులతో కూడిన ప్రత్యేక నిపుణుల బృందం కలిసి దశలవారీగా చిన్నారి ఆరోగ్య పరిస్థితిని స్థిరీకరించారు. కాలేయ మార్పిడికి సిద్ధం చేయడం వంటి అంశాలను సమన్వయంతో నిర్వహించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి స్థిరపడిన అనంతరం సుమారు మూడు వారాలకు కాలేయ మార్పిడిని విజయవంతంగా నిర్వహించారు. చెన్నైలోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అండ్ హెచ్‌పీబీ సర్జరీ విభాగం గ్రూప్ డైరెక్టర్ డా. మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, గిండి రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో పీడియాట్రిక్ హెపటాలజీ-లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సీనియర్ కన్సల్టెంట్ డా. సోమశేఖర హెచ్.ఆర్., అలాగే పీడియాట్రిక్ నెఫ్రాలజీ-కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సీనియర్ కన్సల్టెంట్ డా. ప్రహ్లాద్ ఎన్., పీడియాట్రిక్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డా. ప్రసన్న గోపాల్, పీడియాట్రిక్ సర్జన్ మరియు యూరాలజిస్ట్ సీనియర్ కన్సల్టెంట్ డా. నందిని జి., పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ కన్సల్టెంట్లు డా. కార్తీక్ నారాయణన్ ఆర్. మరియు డా. నటరాజ్ పి., పీడియాట్రిక్ హిమటో-ఆంకాలజీ కన్సల్టెంట్ డా. మీనా శివశంకరన్, అనస్థీషియాలజీ విభాగానికి నాయకత్వం వహించిన డా. సతీష్ చందర్ తదితరుల సమన్వయంతో ఆ చిన్నారి జీవితానికి ఆరోగ్యపరంగా కొత్తవెలుగులు వచ్చినట్లయింది.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

# 'కృష్ణ చైతన్య' స్పోర్ట్స్ మీట్

నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల స్థానిక 'కృష్ణ చైతన్య' జూనియర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ సందడిగా జరిగింది. సుమారు నాలుగున్నర వేలకి పైగానే విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ పర్వతరెడ్డి రాణాప్రమోద్‌రెడ్డి తమ సిబ్బందితో కలసి పాల్గొని పర్యావరణ కాలుష్య నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. డాక్టర్ ఆర్ వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, తమ విద్యాసంస్థల విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు.. క్రీడల్లో కూడా ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఇంటర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ నిర్వహించామన్నారు. విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. తొలిరోజు కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణచైతన్య విద్యాసంస్థ లలో విద్యార్థులకు చదువుతోపాటు, క్రీడలు ఇతర విభాగాల్లో ప్రోత్సాహం అందిస్తుండడం అభినందనీయమన్నారు. కృష్ణ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు..చదువుల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటుతూ.. క్రీడల్లో కూడా మేటిగా రాణిస్తుండడం.. కృష్ణ చైతన్య విద్యా సంస్థల పనితీరుకు నిదర్శనం అన్నారు. విద్యాసంస్థల డీన్ రామాంజనేయులురెడ్డి, అకాడమిక్ డీన్ రాంగోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ పాయసం రమేష్, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో పాటు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తమ జర్నలిస్టులకు..త్వరలో అవార్డులు

## 12 విభాగాల్లో పురస్కారాలు

### - రాష్ట్ర సమాచారశాఖ సంచాలకులు విశ్వనాథన్ వెల్లడి

జర్నలిజం రంగంలో విశేష సేవలందిస్తూ, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పాత్రికేయులను ప్రోత్సహించి, వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్సరానికి 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవార్డులకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఆయా విభాగాలకు చెందిన జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమేరకు గడువును 2026 అక్టోబర్ 5వతేదీకి పొడిగించినట్లు ఆయన తెలిపారు. అర్హత కలిగిన జర్నలిస్టులు తమ దరఖాస్తులను 5వ తేదీ సాయంత్రం 5గంటలలోగా డైరెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ, 2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ – 520013 పంపాలని కోరారు.

### ప్రముఖ పాత్రికేయుల పేర్లతో అవార్డులు :

ఈ అవార్డులతోపాటు కమిటీ విచక్షణాధికారంతో ఎంపిక చేసే 3 పురస్కారాలు కూడా ఉన్నాయని, వాటికి జర్నలిస్టుల నుంచి ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించకుండా, ఎంపిక కమిటీ తన విచక్షణాధికారంతో పురస్కార గ్రహీతలను ఎంపిక చేస్తుందని తెలిపారు. వి.ఆర్.నార్ల జీవిత సాఫల్య పురస్కారం, కొక్కు అహోబలరావు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డు, మద్దూరి అన్నపూర్ణయ్య పేరిట రాష్ట్రంలోని చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంపాదకులకు అందించే అవార్డు ఉంటాయన్నారు. దరఖాస్తుల ఆధారంగా కమిటీ ఎంపిక చేసే అవార్డులలో కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు ఉత్తమ జర్నలిస్టు అవార్డు (నగదు పురస్కారం : రూ.2 లక్షలు) ఉంటుందన్నారు. అంతేకాక, ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డులు, గ్రామీణ జర్నలిజంలో విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు జర్నలిస్టులకు ప్రముఖ పాత్రికేయుల పేర్లతో మూడు అవార్డులు అందజేస్తామన్నారు. ప్రముఖ పాత్రికేయులు ఖాసా సుబ్బారావు, ముట్నూరి కృష్ణారావు, మద్దుకూరి చంద్రశేఖర రావు పేర్లతో ఆ అవార్డులుంటాయని, ఒక్కో అవార్డు కింద నగదు పురస్కారంగా లక్ష రూపాయలు అందజేస్తారని తెలిపారు. ఇవి కాక, ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు పురస్కారంతో సావిత్రిబాయి పూలే ఉత్తమ మహిళా జర్నలిస్టు అవార్డు, ఉత్తమ కార్టూనిస్టు అవార్డు, అబుల్ కలాం ఆజాద్ ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు అవార్డు, ఉత్తమ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అవార్డు, ఉత్తమ వీడియో జర్నలిస్టు అవార్డు ఉంటాయన్నారు. పూర్తి సమాచారాన్ని సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలోని మీడియా రిలేషన్స్ వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చునని తెలిపారు.

# పోలీసుల విధుల్లో..

## సేవాభావం, క్రమశిక్షణ ముఖ్యం

### మంత్రి ఆనం



పోలీసులకి మెడల్స్ అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రాష్ట్ర ప్రజల రక్షణ బాధ్యతలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, విధి నిర్వహణలో సేవాభావం, విలువలు, క్రమశిక్షణ, నిబద్ధతతో పోలీసులు పనిచేయాలని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల వెంకటాచలం మండలం చెముడుగుంటలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసు కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్‌లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజం కోసం పాటుపడే పోలీసుల త్యాగాలను మరువలేమన్నారు. పోలీసు కానిస్టేబుళ్లకు గొప్పగా శిక్షణ అందించడంలో కృషి చేసిన జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల, అడిషనల్ ఎస్పీ, ప్రిన్సిపాల్ సౌజన్య, డీఎస్పీ,వైస్ ప్రిన్సిపాల్ గిరిధరరావు తదితరులను అభినందించారు.

### నేనూ పోలీస్ కుటుంబం నుంచే వచ్చా :

పోలీసు వ్యవస్థతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని మంత్రి ఆనం గుర్తుచేసుకున్నారు. తాను పోలీసు కుటుంబం నుంచి వచ్చానని, ఒక పోలీసు అధికారికి మనవడిగా, మరో పోలీసు అధికారికి తమ్ముడి కొడుకుగా, ఇద్దరు హోం మంత్రుల కుటుంబాలతో అనుబంధం ఉన్న వ్యక్తిగా పోలీసు వ్యవస్థతో తనకు అనుబంధం ఉందన్నారు. తాను ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన సమయంలో పోలీసు శిక్షణ కళాశాల ఏర్పాటుకు 13.5 ఎకరాల స్థలాన్ని 2005లో పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్‌కు కేటాయించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు మెడల్స్, జ్ఞాపికలను అందించి అభినందించారు.

## • అక్టోబర్ 2 – గాంధీ జయంతి

# మన మహాత్ముడు



***ఆయన దేశం కోసం జీవించాడు. దేశ బానిస శృంఖలాలను తెగదెంచేందుకు అహింస అనే ఆయుధంతోనే అవిశ్రాంత పోరాటం చేశాడు. తెల్లదొరల నిరంకుశ పాలనకి ఎదురొడ్డి నిలిచాడు. భారతమాతకి విముక్తి కలిగించాడు. ఆయనే..మన మహాత్ముడు..జాతిపిత మహాత్మాగాంధీజీ. ఆ మహనీయుడు అక్టోబర్ 2న జన్మించారు. నేడు ఆ మహానుభావుని జయంతి. జీవితమంతా సత్యనిష్ఠతో, ధర్మాచరణతో జీవించాడు. అహింసాయుధంతోనే దేశస్వాతంత్ర్యం కోసం పోరాడి అందరికీ మార్గదర్శకమయ్యారు. జాతిపితగా అందరికీ పూజనీయుడయ్యారు. ఈ జయంతిరోజున ఆ మహాత్ముని జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలను ఒకసారి మననం చేసుకుందాం.***

మహాత్మాగాంధీజీ అంటే..నిజాయితీకి, నిబద్ధతకు నిలువెత్తు రూపం. అమేయమైన కార్యదీక్షాదక్షతలకు ఆయనే ప్రతిరూపం. 1893లో దక్షిణాఫ్రికాలో న్యాయవాదిగా పనిచేసే రోజుల్లో ఫస్ట్ క్లాస్ టికెట్ ఉండి రైలు ఎక్కితే, నల్లవాడివని చెప్పి తెల్లవాళ్లు ఆయన్ను రైలులోంచి బయటకు గెంటేశారు. అప్పట్లో జాతి–వర్ణ వివక్షలు అంత దారుణంగా ఉండేవి. ఆ చలి రాత్రి స్టేషన్‌లో గాంధీజీ ఒంటరిగా కూర్చున్నాడు. ఇలాంటి బాధలతో తన దేశం వారు ఇంకెన్ని బాధలు పడుతున్నారోనని మరింతగా ఆవేదన చెందాడు. ఈ అవమానం తనకు ఒక్కడికే కాదు, దేశం మొత్తానికి జరిగింది అనుకుంటూ బాధపడ్డాడు. అదే.. ఆయనలో దేశ స్వేచ్ఛకి.. స్వాతంత్ర్య పోరాట సంకల్పానికి నాంది పలికింది. నిజానికి.. లండన్‌లోనే బారిస్టర్‌గా ఉంటే ఎంతో ధనం సంపాదించేవారాయన. కానీ, ఆయనకు ధనం కన్నా జనం ముఖ్యం. అన్నిటికన్నా దేశ ఆత్మాభిమానం ప్రధానం. దేశం కోసం ప్లీడరు ఉద్యోగాన్ని వదిలిపెట్టి, దేశమంతా తిరిగాడు. ప్రజల కష్టాలు తెలుసుకున్నాడు. పేదవాడి కష్టం తెలియాలంటే పేదవాడి లాగానే బతకాలి అని నమ్మిన అసలు సిసలైన నాయకులాయన. ఆయన నిరాడంబర జీవితం, ఆశయసాధన కోసం అహింస అనే ఆయుధంతోనే ఆయన పోరాడిన తీరు..అద్భుతం..అమోఘం!..అద్వితీయం!..

### సత్యనిష్ఠతోనే బాపూజీ జీవితం :

గాంధీజీ అత్యంత సాధారణ జీవితం గడిపేవారు. 'సత్యం' అంటే ఆయనకి ప్రాణం. జీవితాంతం సత్యనిష్ఠతోనే జీవించారు. నైతిక విలువలకి ప్రాధాన్యత ఇచ్చేవారు. హింసలను వ్యతిరేకించేవారు. శాంతి సామరస్యాలనే కోరుకునేవారు. దేశస్వాతంత్ర్యమే ఊపిరిగా తన దీక్షలను తాను కొనసాగించేవారు. లక్ష్యసాధనలో ఎన్ని కష్టనష్టాలెదురైనా వెనుకంజ వేసేవారు కాదు. అప్పట్లో స్వాతంత్ర్యం కోసం చాలామంది యోధులు తుపాకీ పట్టారు. కానీ గాంధీజీ వారికి ఒక కొత్త దారి చూపాడు. దాని పేరే 'సత్యాగ్రహం'. అహింసతోనే ఆయన ముందుకుసాగారు. బ్రిటీష్ పాలకుల దౌష్ట్యాలకు ఎదురొడ్డి నిలిచాడు. 1920లో సహాయ నిరాకరణ, 1930లో ఉప్పు సత్యాగ్రహం, 1942లో క్విట్ ఇండియా.. ఇవన్నీ ఆయన ఈ అహింసాయుత దారిలోనే చేశాడు. పోరాడి గెలిచాడు. దేశాన్ని గెలిపించాడు.

### గాంధీజీ ఆశయాల బాటలో నడవాలి :

ఇప్పుడు ప్రపంచం అధునాతన రీతిలో శరవేగంగా పయనిస్తోంది. ఆధునిక సాంకేతికతతో అందరి చేతిలో సెల్‌ఫోన్లు, ఇంట్లో కంప్యూటర్లు వచ్చేశాయి. కానీ, మనసుల్లో ప్రశాంతత లేదు. ప్రతి చోటా ఏవో..ఏవేవో కలతలు, ఏవో తెలియని ఆవేదనలే అందరిలోనూ ఉంటున్నాయంటే అతిశయోక్తి కాదు. అంతా ఉరుకులు పరుగులే. యాంత్రిక జీవితం అయిపోయింది. ఇలాంటి సమయంలో గాంధీజీ వంటి మహనీయుల జీవితచరిత్రలను చదివి బాగా ఆకళింపు చేసుకోవాలి. తద్వారా మంచి స్ఫూర్తిని పొందాలి. వారిలా మనం కూడా దేశభక్తితో జీవిస్తూ, దేశ అభ్యున్నతికి ప్రతిఒక్కరం కష్టపడాలి. నేటి మన స్వేచ్ఛా జీవితం.. ఒకప్పుడు గాంధీజీ వంటి స్వాతంత్ర్యసమర యోధుల పుణ్యమేనని గ్రహించాలి. వారెన్ని కష్టాలు పడ్డారో..ఎన్ని త్యాగాలో చేశారో లెక్కే లేదు. వారి సమున్నతమైన ఆశయాల బాటలో అందరం నడవాలి. పిల్లలకు జాతినేతల జీవితచరిత్రలను తెలియజెప్పాలి. పాఠశాలల్లో విద్యార్థులకు గాంధీజీ చరిత్రకి సంబంధించిన పాఠాలు అన్ని తరగతుల్లోనూ ఉండేలా చూడాలి. తద్వారా మన విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుకోవాలి. అదే మన మహాత్మునికి మనమిచ్చే అసలైన నివాళి.



**చల్లా చంద్రశేఖర్‌రెడ్డి**
9440928666

# లోకకల్యాణం కోసం జన్మించిన

## మహర్షి..వేదవ్యాసుడు!

### అవధాని కోట రాజశేఖర్



సత్కారాన్నందుకుంటున్న కోట రాజశేఖర్

లోక కల్యాణం కోసం జన్మించిన మహర్షే వేదవ్యాసుల వారని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. నెల్లూరులోని పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామ స్వామి మందిరంలో సెప్టెంబరు 27న ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజున సంపూర్ణ వాల్మీకి రామాయణం ఆడియోకర్త, బాలకాండ పద్యానువాదకులు కోట రాజశేఖర్ తన ప్రవచనంలో వేదవ్యాసమహర్షి విశిష్టతను వివరించారు. ఈ విశ్వానికంతటికీ అవసరమైన జ్ఞానాన్ని సంపూర్ణంగా కలిగియున్న వేదరాశిని వేదవ్యాసుల వారు ఋగ్వేదం, యజుర్వేదం, సామ వేదం, అధర్వణవేదం అనే నాలుగు వేదాలుగా విభజించి లోక సౌభాగ్యం కోసం వాటిని విస్తరింపజేశారన్నారు. పంచమవేదంగా ప్రసిద్ధిగాంచిన మహాభారతాన్ని వ్యాసమహర్షి లక్షశ్లోకాలుగా రచించి ధర్మం గురించి బోధించారన్నారు. సంస్కృత భాషలో రచింపబడిన మహాభారతాన్ని కవిత్రయం నన్నయ, తిక్కన, ఎర్రన తెలుగుభాషలోనికి అనువదించి లోకోపకారం చేశారన్నారు. అనంతరం రాజశేఖర్‌ను ప్రపంచ తెలుగు సమాఖ్య రీజియన్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, పోలవరపు లక్ష్మీనరసింహారావు, డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు, శ్రీ సీతారామస్వామి మందిరం పాలకవర్గం వారు, పద్యసారస్వత పరిషత్ సభ్యులు శాలువాలతో సత్కరించారు.

# సీబీఐపై.. మీకు నిజంగా నమ్మకం ఉందా?

మీకు నిజంగానే సీబీఐపై నమ్మకం ఉందా?..ఎంతో పటిష్టంగా డీఎస్‌సి పరీక్షలు నిర్వహించినా ఎందుకు మీరు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి వైసీపీ నాయకులను ఉద్దేశించి ప్రశ్నించారు. ఇటీవల ఆయన వైసీపీ చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ.. డీఎస్సీపై సీబీఐ విచారణకు తాము సిద్ధమని, అయితే ఒక్క షరతని అంటూ, 2012కు ముందు జగన్‌రెడ్డి తన తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని వేల కోట్ల అక్రమాస్తులు కూడ గట్టారని సీబీఐ కేసులు నమోదు చేసిందని, ఆ రోజు సీబీఐ కరెక్ట్ కాదంటూ జగన్మో



## వైసీపీ నేతలకు సోమిరెడ్డి సూటిప్రశ్న

హన్‌రెడ్డి కోర్టులో కౌంటర్ దాఖలు చేశారని గుర్తుచేశారు. బెయిల్ తెచ్చుకుని అప్పటి నుంచి ఇప్పటిదాకా కోర్టులో కేసులు నడుపుతూనే ఉన్నారని, దాదాపు 15 సంవత్సరాలుగా కేసులు నడుస్తూనే ఉన్నాయి... అయినా సీబీఐపై వారికి నమ్మకం లేదని అన్నారు. బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాష్ రెడ్డి దగ్గర నుంచి చాలా మందిని ముద్దాయిల్ని చేశారని, ఆ కేసులో కూడా సీబీఐ కరెక్ట్ కాదంటూ అందరూ బెయిల్లు తెచ్చుకుని కోర్టులో కౌంటర్లు దాఖలు చేస్తున్నారని ఆయన అన్నారు. వైసీపీకి నిజంగా సీబీఐపై నమ్మకం ఉంటే అక్రమాస్తుల కేసుతో పాటు బాబాయి హత్య కేసు విచారణల్లో సీబీఐ తేల్చిన అంశాలను వాస్తవాలు అని ఒప్పుకోవాలని ఆయన అన్నారు.

# 60 కోట్లతో ఆధునిక మార్కెట్

## మంత్రి నారాయణ



నెల్లూరులోని నవాబు పేట మార్కెట్ యార్డులో త్వరలోనే రూ.60 కోట్లతో ఆధునిక మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. తొలిదశలో రూ.13 కోట్లతో పనులు ప్రారంభిస్తామని, వ్యాపారులతో చర్చించి వారికి అనుకూలంగా నిర్మాణాలను చేపడతామని చెప్పారు. ఆదివారం నెల్లూరు నగరంలోని వివిధ డివిజన్లలో మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 4వ డివిజన్ కృష్ణవేణి స్కూల్ వీధిలో రూ.16 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు, 7వ డివిజన్ వైఎంఎం ఎలిమెంటరీ స్కూల్ సమీపంలో రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. 9వ డివిజన్ నవాబుపేటలో రూ.60 కోట్లతో నిర్మించనున్న ఆధునిక మార్కెట్ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ 2028 జూన్ 12 నాటికి నెల్లూరు నగరాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

# తీరప్రాంతాల ప్రగతికి.. సెజ్‌లు కీలకం



## ● 'నమస్తే ఏషియా' సదస్సులో శ్రీసిటీ ఎం.డీ సన్నారెడ్డి

చెన్నైలో సెప్టెంబరు 30న జరిగిన నమస్తే ఏషియా సమ్మిట్ – 2026 లో శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేశారు. "బిల్డింగ్ పార్ట్‌నర్ షిప్స్ ఫర్ ఏషియాస్ నెక్స్ట్ గ్రోత్ స్టోరీ" అనే అంశంపై ప్రసంగించిన ఆయన, ఆసియా దేశాల కంపెనీలకు భారత్, ముఖ్యంగా దక్షిణ భారతదేశం అందిస్తున్న తయారీ, పెట్టుబడి, సరఫరా గొలుసు అవకాశాలను వివరించారు. సెజ్‌లు, పారిశ్రామిక కారిడార్లు, తీరప్రాంత మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలు అంతర్జాతీయ కంపెనీలను స్థానికంగా తయారీ కేంద్రాలు, సరఫరాదారుల నెట్‌వర్క్‌లు ఏర్పాటు చేసేందుకు దోహదపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆసియా దేశాల కంపెనీలు స్థానిక తయారీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వలన, వాటితో పాటు సరఫరా గొలుసు కంపెనీలు తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. ప్రత్యేకించి శ్రీసిటీ వంటి అంతర్జాతీయ మౌలిక వసతులు గల పారిశ్రామిక కేంద్రాలు, ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటు, తీరప్రాంతాల అభివృద్ధి వంటి కారణాల వల్ల అంతర్జాతీయ కంపెనీలు తమ కార్యకలాపాలకు దక్షిణ భారత ను కేంద్రంగా ఎంచుకుంటున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో ఆసియా దేశాల పారిశ్రామిక, వ్యాపారాభివృద్ధిలో దక్షిణ భారత దేశాన్ని ముఖ్య భాగస్వామిగా తీర్చిదిద్దడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత మరియు పారిశ్రామిక సహకారాన్ని మరింత విస్తరించే అంశాలపై సీఐఐ సదరన్ రీజియన్ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు. "కౌలాలంపూర్ అండ్ సెలంగోర్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ" అధ్యక్షుడు కె.కె.రాజశేఖరన్, సీఐఐ సదరన్ రీజియన్ చైర్మన్, డాన్ఫాస్ ఇండియా ప్రెసిడెంట్ రవిచంద్రన్ పురుషోత్తమన్ తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం!

## ● తిరుపతి సదస్సులో నెల్లూరు కలెక్టర్ హిమాన్షు శుక్ల



రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్దేశించిన 15 శాతం వృద్ధి రేటును సాధించేందుకు జిల్లాల కలెక్టర్లు, అధికారులు పరస్పరం సహకరించుకుంటూ ఒకే దిశగా పని చేయాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ పరిధిలోని జిల్లాలన్నీ సమన్వయంతో పనిచేసినప్పుడే సమగ్ర పారిశ్రామిక, ప్రాంతీయ ప్రగతి సాధ్యమవుతుందన్నారు. బుధవారం ఉదయం తిరుపతి కలెక్టరేట్లో తిరుపతి ఎకనామిక్ రీజియన్ సీఈఓ ముకేశ్ కుమార్ మీనా ఆధ్వర్యంలో జరిగిన భాగస్వాముల సదస్సులో కలెక్టర్ పాల్గొని జిల్లాలోని అభివృద్ధి అవకాశాలు, మౌలిక వసతుల అవసరాలు, పారిశ్రామిక రంగానికి సంబంధించిన అంశాలను వివరించారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలను ఒకే ఆర్థిక రీజియన్‌గా పరిగణించాలన్నారు.

# రైళ్లలో ఆకస్మిక తనిఖీలు..
# ప్రయాణికులూ పారా హుషార్!



**అక్టోబర్ 1 నుంచి 31 వరకు రైళ్లలో ప్రత్యేక తనిఖీలు**

**నిబంధనలు పాటించకుంటే జరిమానా**

రైలు ప్రయాణికులు ఇక మరింత అప్రమత్తంగా ఉండాల్సిన సమయం వచ్చింది. అక్టోబర్ 1 నుంచి 31వ తేదీ వరకు సెంట్రల్ రైల్వే పరిధిలో నెల రోజుల పాటు ప్రత్యేక టికెట్ తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. రైళ్లు, స్టేషన్లలో టికెట్ల చెల్లుబాటు, రిజర్వేషన్ అర్హత, రాయితీ టికెట్లు, రైల్వే పాస్‌లు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. సాధారణంగా టికెట్ ఉందా లేదా అన్నదే తనిఖీల ప్రధాన అంశంగా ఉండేది. అయితే ఈసారి టికెట్ ఉన్నప్పటికీ, దానిపై పొందిన రాయితీకి లేదా ప్రత్యేక కోటాకు ప్రయాణికుడు అర్హుడేనా? టికెట్ పేరుతో ప్రయాణిస్తున్న వ్యక్తి అదే వ్యక్తేనా? వంటి అంశాలపైనా దృష్టి పెట్టనున్నారు. ముఖ్యంగా రాయితీ టికెట్లు, నిర్దిష్ట రిజర్వేషన్ కోటాలు, వివిధ రకాల రైల్వే పాస్‌లు, గ్రూప్ బుకింగ్‌లను పరిశీలించనున్నారు.

### ఒరిజినల్ ఐడీ ఎందుకు?

ప్రత్యేక తనిఖీల నేపథ్యంలో ప్రయాణికులలో ఎక్కువగా చర్చకు వస్తున్న అంశం ఒరిజినల్ గుర్తింపు పత్రం. రాయితీ లేదా నిర్దిష్ట కోటా కింద ప్రయాణించే వారు తమ అర్హతను నిరూపించేందుకు రైల్వే నిర్దేశించిన ఒరిజినల్ గుర్తింపు పత్రాన్ని వెంట ఉంచుకోవాలని అధికారులు సూచించారు. ఒకే టికెట్‌పై పలువురు ప్రయాణిస్తున్న సందర్భంలో కూడా ఈ నిబంధనకు ప్రాధాన్యం ఉంది. టికెట్‌లో పేరున్న ప్రయాణికుల్లో కనీసం ఒకరు అవసరమైన ఒరిజినల్ గుర్తింపు పత్రాన్ని చూపించాల్సి ఉంటుందని సెంట్రల్ రైల్వే అధికారులు వెల్లడించారు. అవసరమైన పత్రం చూపించలేకపోతే, వర్తించే నిబంధనల ప్రకారం టికెట్ చెల్లుబాటుపై సమస్య తలెత్తే అవకాశం ఉంది. రైల్వే అధికారులు ప్రయాణికుల్ని తనిఖీ చేసే తరుణంలో నిబంధనల ప్రకారం ఆధార్, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ లేదా ఏదైనా ప్రభుత్వ ఫోటో గుర్తింపుకార్డు ఒరిజినల్‌ని మాత్రమే అధికారులు గుర్తింపు పత్రంగా పరిగణిస్తారని చెప్తున్నారు.

### డిజిటల్ యుగంలోనూ ఫిజికల్ డాక్యుమెంటేనా?

ఇక్కడే ప్రయాణికుల్లో అసలు సందేహం మొదలవుతోంది. ప్రస్తుతం ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి అనేక గుర్తింపు పత్రాలు డిజిటల్ రూపంలో అందుబాటులో ఉన్నాయి. మొబైల్ ఫోన్‌లో పత్రాల వివరాలు చూపించే సౌకర్యం కూడా విస్తృతంగా ఉంది. అలాంటి సమయంలో ప్రతి ప్రయాణికుడు తప్పనిసరిగా ఒరిజినల్ కార్డునే వెంట తీసుకెళ్లాలా? మొబైల్‌లో ఉన్న డిజిటల్ పత్రాన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోకూడదు? అనే ప్రశ్నలు సహజంగానే వినిపిస్తున్నాయి. అయితే, రైల్వే తనిఖీల విషయంలో ఏ పత్రం చెల్లుబాటు అవుతుంది, ఒరిజినల్ తప్పనిసరా, డిజిటల్ కాపీని అనుమతిస్తారా అనే విషయాన్ని ప్రయాణానికి ముందు సంబంధిత రైల్వే అధికారిక మార్గదర్శకాల ప్రకారం ప్రయాణికులు నిర్ధారించుకోవడం అవసరం. ముఖ్యంగా రాయితీలు, కోటాలు, పాస్‌లకు సంబంధించిన ప్రయాణికులు మరింత జాగ్రత్త వహించాలి.

### అదనపు లగేజీపైనా నిఘా

టికెట్‌తో పాటు లగేజీ విషయంలోనూ ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి. ప్రతి తరగతికి ఉచితంగా తీసుకెళ్లే లగేజీ పరిమితిని రైల్వే నిర్దేశించింది. ఆ పరిమితిని మించిన సామానును నిబంధనల ప్రకారం ముందుగానే బుక్ చేసుకుని, నిర్ణీత రుసుము చెల్లించాలి. లగేజీ బుకింగ్ వివరాలను టికెట్‌తో అనుసంధానం చేసే విధానం కూడా ఉంది. ఉచిత పరిమితిని మించి, బుకింగ్ చేయకుండా అదనపు సామానుతో ప్రయాణిస్తే అదనపు ఛార్జీలు విధించే అవకాశం కూడా ఉంటుంది. అందువల్ల లగేజీ ఎక్కువగా ఉన్న ప్రయాణికులు ప్రయాణానికి ముందే దాన్ని బుక్ చేసుకోవడం మంచిది. చెల్లించిన రుసుముకు సంబంధించిన రసీదు, లగేజీ టికెట్ వంటి ఆధారాలను భద్రంగా ఉంచుకోవడం ప్రయాణ సమయంలో ఉపయోగపడుతుంది.

### తప్పని సరి పరిస్థితులలోనే తనిఖీలు!

రైల్వేలో టికెట్ లేకుండా ప్రయాణించడం, రాయితీలను అనర్హులు వినియోగించడం, పాస్‌లను దుర్వినియోగం చేయడం, రిజర్వేషన్ నిబంధనలను ఉల్లంఘించడం వల్ల వ్యవస్థకు ఆదాయ నష్టం కలగడంతో పాటు అర్హులైన ప్రయాణికులకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్న పరిస్థితులని రైల్వే శాఖ గుర్తించింది . అందుకోసమే ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టి పరిస్థితులని గాడిన పెట్టే ప్రయత్నంలో భాగంగానే ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెప్తున్నారు. అక్టోబర్ నెలలో జరగనున్న ఈ ప్రత్యేక తనిఖీలు రైల్వే వ్యవస్థలో క్రమశిక్షణను పెంచడంతో పాటు, ప్రయాణికులకు నిబంధనలపై మరింత అవగాహన కల్పించేలా ఉండాలి. ప్రస్తుతానికి అక్టోబర్ 1నుండి 31 వరకూ సెంట్రల్ రైల్వే విభాగంలోనే ప్రయోగాత్మకంగా ఈ తనిఖీలు చేపట్టనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఫలితాల ఆధారంగా దేశవ్యాప్తంగా ఈ తనిఖీల కార్యక్రమాన్ని అమలు చేసే ఆలోచనలో రైల్వేశాఖ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అందుకే అంటున్నాం "ప్రయాణికులూ పారా హుషార్!"

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com